# మిసిమి

మాస పత్రిక

## అపర భగీరథుడు
## ఆర్థర్ కాటన్



జూన్, 1991

వెల రూ. 3/-

# RAJIV GANDHI
## 1944-1991

**BORN:**
20 August, 1944, Bombay
To Feroze and Indira Gandhi
Grandson to Jawaharlal Nehru

**MARRIED:**
10 February, 1968
To Sonia Maino

**PILOTED:**
IA carriers for 16 years

**ELECTED:**
To parliament from Amethi (U.P.),
securing 84.2% votes
14 June, 1981

**SWORN IN:**
As Prime Minister of India,
after Indira Gandhi's
assassination by her
own bodyguard
on 31 October, 1984

**LED:**
The Congress-I to landslide
victory, winning 415 out of
517 Lok Sabha seats,
24-28 December 1984

★ ★ ★

**RETAINED:**
The post of Prime Minister
for more than five years:
from 31 October 1984
to 1 December, 1989

**INITIATED:**

* Punjab, Assam and Indo-Sri Lankan accords
* Electoral reforms
* Technology missions

Played a key role in:
Non-aligned movement
* Nuclear disarmament
* Apartheid
* Namibia

**ESCAPED:**
Two assassination bids at
Gandhi Samadhi, Rajghat, New Delhi
on 2 October, 1986 and
at Sri Lanka while inspecting a
guard of honour on 30 July, 1987

**KILLED:**
In a bomb blast while campaigning
at Sriperumbudur near Madras,
Tamil Nadu on 21 May, 1991

★ ★ ★

# మిసిమి

*"All that we are is the product of what we have thought,"*
*is "We are what we think."* – **Dammapada.**

సంపుటి 2 జూన్ 1991 సంచిక 23

విషయసూచిక

జిడ్డు కృష్ణమూర్తిలోని రసజీవి – డా॥ సంజీవదేవ్

కందుకూరి వారి
రాజశేఖర చరిత్రము – డా॥ ఎ. రమాపతిరావు

ఎలిజీ – డా॥ వి.వి.యల్. నరసింహారావు

మధురవాణితో శ్రీ శ్రీ – పురాణం సుబ్రహ్మణ్యశర్మ

కలలుగన్న భారత దర్శనం – ఎన్. ఇన్నయ్య

ముఖచిత్రం

ఆర్థర్ కాటన్

గోదావరి జలాలను పొలాలకు తరలించిన భగీరథుడు
నిస్వార్థ ప్రజా సంక్షేమ నిరతుడు.

వార్షిక చందా రూ.40/-

Printed, Published and Edited by Shri ALAPATI RAVINDRANATH for and at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, Ifterkar Mansion Lane, R.T.C. X Roads, Musheerabad, Hyd-20.

**Editorial NEST**
B-15, Journalist Colony, Jubilee Hills, Hyderabad-500 034.

# MOMENT OF TRUTH

The Congress is already notorious for harbouring criminals in its fold. What is surprising, however, is that eyebrows are not raised when the Bharatiya Janata Party (BJP) which passes itself off as morally superior, fields over 30 diehard dacoits in the Uttar Pradesh elections. It would be a challenging assignment for any enterprising journalist to enumerate how many robbers, dacoits, murderers and rapists are striving to become the guardians of law and order by contesting the elections

"Like the Soviets, we are facing the moment of truth the nehru model has exhausted its potentiality for good."

★ ★ ★

"This is a water shed election, it will change the nature of Indian Politics"

TIME Girilal Jain

★ ★ ★

"Congress is not Best but it is at least safe"

– A. Businessman

★ ★ ★

"If you teach politics in the Language of Religion you can teach it Better"

★ ★ ★

"Food is eaten not by the hungry but by the person who has the right to it"

★ ★ ★

"For they have sown the wind and they shall reap Whirl wind"

# జిడ్డు కృష్ణమూర్తిలోని రసజీవి

– డా. సంజీవదేవ్

మనిషి హేతుబద్ధుడు కానంతవరకు మనిషి కాడు. కాని అతడు హేతుబద్ధుని కంటే ఇంకొంత పెరగంది మామూలు మనిషి కంటే భిన్నుడు కాడు. మానవునిలో ఆలోచనా, హేతువూ ప్రధాన లక్షణాలు అయినప్పటికీ వాటికి తోడు అతనికి అనుభూతి, సృజన కూడ సమానావసరాలు. ఈ విధంగా హేతువు, సృష్టి, ఆలోచనా, అనుభూతి, శాంతి కాంతి మనిషిని ప్రముఖుడిని చేస్తాయి.

నేడు మన మధ్య లేని కృష్ణమూర్తి హేతువాది, రీతి రివాజుల కలీతుడు, స్వేచ్ఛా చింతకుడు, జీవితంలో తెలిసిన దానికి కట్టుపడని ఒక నూతన దృష్టిని సృష్టించిన స్రష్ట వీటన్నిటికీ తోడు ఆయన రసజీవి కూడ. తన పరిసరాల భౌతిక జగత్తులోని సౌందర్యాన్ని, తనలో దాగి ఉన్న భావ జగత్తులోని సౌందర్యాన్ని కూడ ఆనందించేవాడు ఆయన.

వస్తుతః కృష్ణమూర్తి స్వభావం కవితాత్మకం. విచిత్రం ఏమంటే ఆయన పలికే హేతువాదపు పలుకులు కూడ రసంతో అభివ్యక్తమయేవి. ఆయన తర్కం కూడ రసమయ భాషలో వ్యక్తమయ్యేది.

కృష్ణమూర్తి తన ఇతర మానస శక్తులకు తోడు రసమయ కవిగా కూడ భాసించాడు. పూర్వంలో ఆయన కవితా రచన చేస్తుండే వాడు. ఆయన కవితలు తాత్త్విక చింతన కంటే ప్రకృతి సౌందర్యాన్ని ఎక్కువ కలిగి ఉండేవి. ఆయన రచించిన చాలా కవితలు పుస్తక రూపాల్లో వెలువడినాయి. వాటిలోని చాలా కవితలు మాటల ప్రకృతి చిత్రాలు.

సృజనాత్మక, ఆస్వాదనాత్మక దశలలో కూడ ఆయన నిజమైన రసజీవి. తన పద్య రచనల్లోనే కాక గద్య రచనల్లో కూడ ఆయనలోని రసజీవి సున్నితంగా ప్రత్యక్షమవుతుండే వాడు.

ఆకాశంలోని చిన్న మేఘ శకలపు లయమయ చలనానికి ఆయన చలించేవాడు. అదే మాదిరి స్పందించేవాడు. భూమిమీద రాలిన ఆకులోని శరత్ వర్ణాల సూక్ష్మ రాగాలకు, శరత్‌కాలీన మధ్యాహ్నపు చిరుగాలికి ఊగే తెల్లని రెల్లు పూవును చూచి కూడ స్పందించే వాడు. ప్రకృతిలోని అతి సామాన్య వస్తువు కాని, ఘటన కాని ఏదీ కూడ ఆయన తీక్ష్ణమైన రసదృష్టిని తప్పించుకొనేది కాదు.

మేరీ ల్యూటెన్స్ సంస్కరించి పుస్తక రూపంలోకి తెచ్చిన ''కృష్ణమూర్తి నోట్ బుక్'' అనే దానిలోని ఆయన గద్యరచన రసాభివ్యక్తికి గొప్ప నిదర్శనం. ఇక్కడ ఉదహరించిన ఖండికలన్నీ, ఇతర పేర్లు గలవి కానివి, ఇదే పుస్తకం లోనివి.

కృష్ణమూర్తి ఒక నిపుణ పదచిత్రకారుడు. రంగుల మాధ్యమం లేకుండానే రంగుల భ్రమను చిత్రించేవాడు. తన మాధ్యమం కేవలం మాటలే మాటలు. ఆయన మాటలు ఆయన చిత్రాలు, ఆయన మాటలు సంగీతం. అయినప్పటికీ నిజానికి ఆయనవి మాటలే మాటలు!

స్మరణాతీత కాలం నుంచీ మానవ జీవితంలో ప్రకృతి ప్రదర్శించిన పాత్ర ఎంతో ప్రముఖమైన వాటిలో ఒకటి, భౌతికంగానూ, భావుకంగానూ కూడ. ప్రకృతిలోని ప్రాదేశికమైనట్టీ, వాతావరణీయమైనట్టీ దాని జడ రూపాల్లోనూ చేతనా రూపాల్లో కూడ అది మానవ జీవితాన్ని వివిధ రీతుల్లో ప్రభావితం చేసింది.

ప్రకృతిలోని మౌన సంగీతం— శ్రవ్యం కంటే ప్రధానంగా దృశ్యమైంది — కృష్ణమూర్తి జీవితంలోని ప్రతి కదలికను ముగ్ధమోహనం చేసింది ఆయనలోని రసజీవిని నైపుణితో మలిచి కొండలు, లోయలు మైదానాలు, సాగరాలు, సరోవరాలు, నదులు, జలపాతాలు, పచ్చిక బయళ్లు ఎడారులు, తేమ నేలలు, వర్షం, మంచు, పొగమంచు, వృక్షాలు, లతలు, గడ్డి పోచలు, ఆకు, మొగ్గ, పూవు, ప్రభాతకాంతి, మధ్యాహ్న సాయంత్రాలు, ఇవన్నీ కూడ ఆయన్ను పరవశింప చేసేవి.

భావన, కల్పనల జగత్తు ఎంత గొప్పదో, గ్రహణ జగత్తు కూడ అంత గొప్పది. కృష్ణమూర్తికి భావనాక్రియ ఎంత ప్రముఖమో సంవేదనా క్రియ కూడా అంతే. దృష్టి, శ్రవ్యత, వాసన, రుచి, స్పర్శ, ఇవన్నీ కూడ ధ్యానం ఎంత పవిత్రమైందో అంత పవిత్రమైనవే, ఆయన దృష్టిలో. నిజానికి కృష్ణమూర్తి ధ్యానం చేసేవాడే. కాని ఆయన ధ్యానం మూసిన కళ్ల ధ్యానం కాక తెరచిన కళ్ల ధ్యానం, నడుస్తూ మాటాడుతూ చేసే ధ్యానం అది.

జీవితాన్ని ప్రేమించేవాడు ఆయన, జీవితాన్ని పునర్జీవింప చేసేవాడు, జీవితాన్ని ఆరాధించేవాడు.

"ఒక నవ పల్లవపు బలమూ సౌందర్యమూ కూడ అని నశించ తగిందిగా ఉండటంలోనే ఇమిడి ఉంటాయి. దానిలో నుంచి పైకి పొడుచుక వచ్చిన ఒక గడ్డిపోచ వలె తాత్కాలిక మృత్యువును తట్టుకునే శక్తి దానికున్నది."

జీవం సుకుమారమైందీ, నశ్వరమైందీ, కాని దాని నశ్వరత్వం, క్షణభంగురత, కమనీయత మొదలైనవే దాని బలం, దాని శాశ్వతత్వం, దాని దృఢత్వం. అయితే, జీవంలోని కొన్ని దశలు, ప్రత్యేకంగా వృక్ష జాతికి సంబంధించినవి, తాత్కాలిక మృత్యువును తట్టుకుంటాయి. గడ్డిపోచ దాని తాత్కాలిక మృత్యువు అనంతరం జీవిస్తుంది. కాని జంతువుల జీవితం, మనుషుల జీవితం ఎపుడూ కూడ తాత్కాలిక మృత్యువును తట్టుకోలేవు.

కృష్ణమూర్తిలోని రసజీవి ఎంతో సునిశితమైనవాడు కావటంతో దారిలో మొలిచిన చిన్న గడ్డిపోచలో నర్తించే ప్రాణ స్పందనను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయటం పడదు. ఆ కోమలమైన గడ్డిపోచ తన ప్రక్కన నిలిచి ఉన్న మర్రి చెట్టు కంటే తక్కువ బలీయమైంది కాదు, జీవపు విలువలో. రెండూ కూడ మరణానికి, మరణానంతర జీవితానికీ కూడ లోబడి ఉండేవే. ఒక చోట ఆయన వ్రాస్తాడు సెలయేరునూ దేవదారునూ గురించి:

"...... కొండపై నుంచి ప్రవహిస్తున్న సెలయేరు, ఆకుపచ్చని కొండ చెరియ మీది ఏకాంత దేవదారు తరువు ఉన్నంత గట్టిగా వాస్తవంగా."

పై ఖండిక ఒక అసమాప్త వాక్యమైనప్పటికీ ఒక సంపూర్ణ శైల దృశ్యాన్ని చిత్రిస్తుంది. "కొండమీది నుంచి ప్రవహించే సెలయేరు, ఏకాంత దేవదారు తరువు కవులకు, చిత్రకారులకు, కళా మర్మజ్ఞులకు మనోహర వస్తువులు. చాలా ఒంటరి వస్తువులు. వాటంత అవే కంటికి ఆహ్లాదకరంగా ఉంటాయి. ఇక ఒంటరి దేవదారు వృక్షం ఒక ప్రత్యేక ఆకర్షణను కలిగి ఉంటుంది." ఇటువంటి రసానుభూతులు కృష్ణమూర్తికి సన్నిహితాలు. ఏకాంత దేవదారు తరువు నిజంగా ఒక నిటారైన ఆకుపచ్చని జ్వాల. అది గంభీరతా, ప్రశాంతతా కిరణాలను ప్రసరింప చేస్తుంటుంది.

"ఆవలికి చూడటం" అనేది ఒక 'అతి రసాత్మక' చర్య (super-aesthetic act) . ఈ "ఆవలికి చూడటం" అనేది దృష్టిని, దూరదృష్టిని, అంతర్ దృష్టిని కలిగి ఉంటుంది. దీన్నే తరచుగా అంటూంటారు మార్మిక దృష్టి అని. మర్మవాదం అనేది ఒక అర్థంలో అతి రసాత్మకత కంటే భిన్నమైందేమీ కాదు. మర్మవాదం, ఆధ్యాత్మికత లాంటి పదాలను వాడటం కృష్ణమూర్తికి అయిష్టం. కనుక నేను ఆ ప్రత్యేక దృష్టిని "అతి రసాత్మక దృష్టి" అని వ్యవహరిస్తాను. దీన్ని ఆయన అదే అర్థ విస్తృతిగల మరో రూపంలో నిర్మిస్తాడు. ఇది తన వైయక్తిక అనుభవంతో సంబంధించి ఉంటుంది.

"నేటి ఉదయం పెందలకడ లేవగానే చూడటం అనే ఒక మెరుపులాంటిది మెరిసింది. అది ఆగకుండా నిరంతరం సాగిపోతున్నట్లు గోచరించింది. అది ఎక్కడా బయలుదేరలేదు, ఎక్కడకూ చేరలేదు. కాని ఆ చూడటంలో దృష్టి అంతా కూడ సెలయేరుల కావల, పర్వతాల కావల, భూమికీ క్షితిజానికీ ఆవల, ప్రజల కావల చలిస్తున్నట్లు ఉంటుంది."

పై వర్ణనలో మనం దృశ్య స్థావరాన్ని అతిక్రమించి ఆవలకు వెళ్లే చర్యను గ్రహిస్తాం. కాని అది చేరదు. దీన్నే కృష్ణమూర్తి అంటాడు "మార్గమే గమ్యం" (The way is destination) అని, సెలయేర్ల కావలకు, కొండకూ క్షితిజానికీ ఆవలకు పయనించిన దృష్టి ఎక్కడికీ చేరలేదు. కనుక పోవలసిన చోటు కంటే పోతున్న మార్గమే ప్రధానం.

విఖ్యాత కవిశేఖరుడైన కాళిదాసు, వర్డ్స్‌వర్త్, ఇంకా ఎందరో చైనా కవులు మొదలైనవారు తమ కవితల్లో ప్రాకృతిక శోభను చిత్రించటంలో ప్రత్యేక స్ఫూర్తిని ప్రదర్శించారు. కాని వారి కవితలకూ కృష్ణమూర్తి వాటికీ మధ్య ఒక ప్రముఖ ప్రభేదం ఉన్నది. వారి ప్రకృతి వర్ణనలు కవిత్వం నిమిత్తమే చేయబడినవి; కృష్ణమూర్తివి ఆవిధంగా కాక జీవితం నిమిత్తం చేయబడినవి. వారివి రసాత్మక అభివ్యక్తులైతే కృష్ణమూర్తివి "అతిరసాత్మక" అభివ్యక్తులు. ఆ కవులు వృత్తి కవులు కనుక వారి ధ్యేయం పూర్ణ కవిత, కృష్ణమూర్తి వృత్తి కవి కాదు కనుక పూర్ణరచన ఆయన ధ్యేయం కాదు; మౌన రసానుభవం ఆయన ప్రథమ ధ్యేయం, తిరిగి దాన్ని అభివ్యక్త పరచటం ఆయన తరువాతి ధ్యేయం. తన రసానుభవాన్ని తాను మాటల మాధ్యమంలో అభివ్యక్త పరచినప్పటికీ ఆయన మాటలు తన రసానుభవా అంత ప్రధానాలు కావు. అందువల్ల తన

అభివ్యక్తం కాని అనుభవాలు మనకు ప్రత్యక్ష ఆనందాన్ని కలిగిస్తాయి, అవి మాటల మాధ్యమంలో అభివ్యక్తమైనట్లు నటించినా కూడ.

ప్రకృతి కవితా రచన చేసిన ప్రాచీన ఆచార్యులంతా ఇతివృత్తాలను ఎంపిక చేసుకొని వాటిని చిత్రించటంలో జాగ్రత్త వహించి ఉండేవారు కనుక వారి కళ సునిర్మిత కళ. కాని కృష్ణమూర్తి భిన్నుడు; కనుక ఆయన అభివ్యక్తులు ప్రయత్న పూర్వక నిర్మాణాలు కాక సజీవ ప్రాణ స్పందనలు.

ఈ సందర్భంలో ఆయన స్వంత మాటలే ఇక్కడ ఉద్ధరించబడినాయి:

''సృజన అనేది నిపుణుల నిమిత్తం, ప్రతిభావంతుల నిమిత్తం మాత్రమే కాదు. వారు సృజన శీలతను ఎరుగుదురు కాని సృజనను ఎరుగరు. సృజన అనేది ఆలోచనకూ, కల్పనకూ, ఆవలిది; మాటలకూ అభివ్యక్తికీ ఆవల ఉంటుంది. అది సూత్రాలకందేది కాదు కనుక ఒకరికి తెలియపరచేది కాదు. అది మాటలలో పొదగబడేది కాదు. నిండు ఎరుకలో అనుభూతి చెందతగినది మాత్రమే అది.''

ప్రపంచం ఎక్కువగా దృశ్యమానం శ్రవ్యమానం కంటే. శబ్దానికంటే రూపం (రంగు కూడ) ఎక్కువ సార్వత్రికం. రూపాలు తమంత తామే ఉంటాయి ఎల్లప్పుడూ. కాని శబ్దాలు అట్లా కాదు. వాటిని సృష్టించాలి. మనం కన్ను తెరవగానే ఏదో ఒక రూపం ప్రత్యక్ష మవుతుంది కంటి ముందు. అంటే రూపం యొక్క ఉనికి తెంపు లేకుండా ఉంటుంది. కాని శబ్దం యొక్క ఉనికి ఆ విధంగా ఉండదు. వాస్తవానికి నిశ్శబ్దం శాశ్వతంగా ఉంటుంది కాని శబ్దపు ఉనికి మాత్రం క్షణభంగురం.

ప్రతి రూపమూ కూడ ఒక ఆభాస (Appearance). ఆభాస గుండానే కన్ను చూస్తుంది రూపాన్ని. ఆభాసించేది ఏదో అది రూపం (రంగు కూడ). ఆభాస లేనపుడు రూపమే గోచరించదు. వస్తు జగత్తంతా ఆభాస జగత్తే.

వస్తువు ఉంటుంది; వస్తువుకు రూపం ఉంటుంది; రూపానికి ఆభాస ఉంటుంది. రూపాన్ని కన్ను ఆభాస ద్వారా గ్రహిస్తుంది. వస్తువు, దాని రూపం ఒకటి కావు. వస్తువు యొక్క రూపం వస్తువు నుంచి వేరై ఉంటుంది. వస్తువు స్పర్శనీయం, రూపం దృశ్యమానం. మనం రూపాన్ని చూడగలమే కాని దాన్ని తాకలేం. వస్తువును మనం తాకగలం కాని రూపం గుండా తప్ప దాన్ని చూడలేం.

అదేవిధంగా రూపం నుంచి ఆభాస వేరుగా ఉంటుందా? అవును, రూపం అనేది వస్తువుకు చెందింది, ఆభాస అనేది కనిపించటం అనే క్రియకు చెందింది. కనిపించుట వేరు, చూచుట వేరు. కనిపించటం వస్తుగతం, చూచుట వ్యక్తిగతం. మనకు కనిపించేది మనం చూచే దానికంటే భిన్నం కావచ్చు.

ఆభాసలు మోసగించేయిగా ఉంటాయని వాడుక. అయినా, ఆభాసలను ఆనందించటానికి మనం సందేహించం. రంగు అనేది ఇటువంటి ఆభాసలోని మోసమే అయినా రంగును మనం ఆనందిస్తాం; ఒక గొప్ప రసానందపు వస్తువుగా, నీల వర్ణాన్ని చూచిన రసానుభవాన్ని కృష్ణమూర్తి వర్ణిస్తాడు:

''రెండు విస్తృతమైన అనంత మేఘాల మధ్య ఒక నీలాకాశపు శకలం కనిపిస్తున్నది. అదొక నిర్మలమైన పారదర్శక అద్భుత నీలం. కొద్ది నిమిషాలల్లో అది మూతబడి పోతుంది; శాశ్వతంగా అదృశ్యమై పోతుంది. అదే నీలాకాశం ఇంకెప్పటికీ కనిపించక పోవచ్చు. రాత్రంతా ఉదయం అంతా వర్షం, కొండల మీద సరిక్రొత్త మంచు కనిపిస్తుంది. ఇదివరలో కంటే ఆ పచ్చిక బయళ్లు ఇంకా ఎక్కువ పచ్చగా, ఇంకా ఎక్కువ మంచిగా కనిపిస్తున్నాయి. కాని ఆ నిర్మల నీలాకాశపు ఖండిక మళ్లీ ఎప్పటికీ కంటికి కనిపించదు! ఆ చిన్న ఖండికలో వియత్తలంలోని వెలుగు అంతా, ఆకాశపు నీలం యావత్తూ ఇమిడి ఉన్నది!''

వస్తుగత వర్ణశోభను చూపే వ్యక్తిగత మైన అద్భుత నిసర్గ దృశ్యం అది. నిజంగా అదొక అద్భుత నీల పదచిత్రం!

కృష్ణమూర్తి చేసే అసంఖ్యాక ఉపన్యాస పర్యటనలు ఆయన్ను ప్రపంచపు నాలుగు మూలలకు త్రిప్పుతాయి — కొండలు, మైదానాలు, తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలు మొదలైన తావులకు ప్రతి తావున ఆయనలోని రసజీవి ప్రకృతిలోని లావణ్యపు అద్భుతాలను, అక్కడి వాతావరణంలోని మారుతుండే సుకుమార దృశ్యాలను, ఆ స్థలాల విశేషాలను ఆనందిస్తుంటాడు. ఆయన చెప్పేదాన్ని ఆయన అనుభవిస్తాడు, ఆయన అనుభవించినదాన్ని ఆయన చెపుతాడు. దృష్టి నుంచి అనుభవానికీ, అనుభవం నుంచి అభివ్యక్తికీ. తాను స్వయంగా దర్శించిన మౌలిక దృశ్యాల కంటే ఆయన చేసే అభివ్యక్తులు ఎక్కువ వాస్తవాలుగా ఉంటాయి. అయితే, ఆయన వాస్తవికత అనుకరణ వాస్తవికత కాక కవితాత్మక వాస్తవికతగా ఉంటుంది. కవితాత్మక వాస్తవికతలో స్రష్ట తాను వస్తు జగత్తులో చూచిన దాన్ని అనుకరించక వస్తు దృశ్యాల నిర్మాణాన్ని కొంత మార్పు చేస్తాడు. అయినా, బాహ్య జగత్తులోని వస్తు రూపాలతో తన నిర్మిత రూపాల సారూప్యానికి భంగం కలిగించడు. ఈ అర్థంలో వాస్తవ వాదం అనేది బొత్తుగా బాహ్య జగత్తుతో పోలిక లేని స్థితి (non-representational) కాదు. ఒక విధంగా పోలిక ఉన్న స్థితి కొంత, పోలిక లేని స్థితి మరికొంత. ఆయన వర్ణించిన మరో దృశ్యం:

''భూమి, భూమ్మీది అలసిన ప్రజలు, వడిగా పారుతున్న సెలయేరు, ప్రశాంతమైన మైదానం మొదలైన వాటి లావణ్యాన్ని చూచిన దానికంటే పొందిన అనుభూతి అధికంగా ఉంటుంది. తిరుగు ప్రయాణంలో ఒక కొండ కుటీరం దగ్గర ఆకాశం అంతా కూడ గాఢ మేఘాలతో మూయబడి దూరంగా ఎత్తు బండల మీద అస్తంగత సూర్యుడు కనిపించాడు. ఆ బండల మీది సూర్యకాంతి మార్గం సౌందర్యానుభూతుల లోతులను రమ్యంగా వ్యక్తపరుస్తుంది. అటువంటి దాన్ని ఏ చెక్కబడిన శిల్పం కూడ వ్యక్త పరచలేదు. అది లోలోపల నుంచి వెలుగుతున్నట్లు అనిపించింది.. ఆ ప్రశాంత కాంతి వాటి స్వంత కాంతిగా కనిపించింది. అది ఆనాటి దినాంతం.''

సాంధ్య ప్రకృతి యొక్క ఒక గొప్ప సుందరమైనట్టి, గంభీరమైనట్టి చిత్రణ వర్ణన అది. వెలుగు చాలా వరకు బయట నుంచి వచ్చి పడుతుంది వస్తువుల మీద. అందువల్ల ఆ బండల ముఖాల మీద కృష్ణమూర్తి చూచినప్పుడు బయట కాంతి పడుతూంది. కాని ఆ కాంతి ఆ బండల్లో నుంచి వస్తున్నట్లు ఆయన వర్ణించాడు. దాని

ప్రకారం బండలు బయట నుంచి వెలుగును తీసుకోక తమలో ఉన్న వెలుగునే బయటికి వ్యక్త పరుస్తున్నాయని.

గ్రహణ శక్తికి పరిశీలన, అంతర్‌దృష్టి అనేవి ప్రధానాలు. మొదటిది బాహ్య గ్రహణ, రెండవది అంతర్ గ్రహణ. పరిశీలన అనేది వస్తువుల వైపుకు చూస్తుంది. అంతర్‌దృష్టి చూస్తుందివస్తువులలోపలికి. సంధ్యా దృశ్యాన్ని చూడటంలో కృష్ణమూర్తి ఈ రెండు ప్రక్రియలను కూడ ప్రవేశపెట్టేడు. ఆ బండల ముఖాలమీద బయటనుంచి సూర్యకాంతి వచ్చి పడుతున్నదనే పరిశీలన ఆకాంతి బండలలో నుంచే వ్యక్తమవుతున్నదనే కవితాత్మక మానస ముద్రను ఆయనలో సృష్టించింది. మొదటిది ఇంద్రియానుభవ సత్యం, రెండవది కవితాత్మక సత్యం. ఈ రెండూకూడ వరసగా వస్తుగత వాస్తవాన్ని వ్యక్తిగత మానస ముద్రనూ కలిగి ఉంటాయి. వాటిలో ఏవీ మిథ్యకావు. వాస్తవికత వాస్తవికతంత వాస్తవం అయింది, మానస ముద్ర మానస ముద్రంత వాస్తవమైంది. అన్ని మానసముద్రలు భ్రమలుకావు. అదే మాదిరి కొన్ని వాస్తవాలు భ్రమలుగా కూడా ఉంటాయి. కృష్ణమూర్తి హేతువాది కనుక ఆయన వాస్తవత్వపు ఆరాధకుడు. కాని అదే సమయంలో ఆయన రసజీవి కూడ. అందువల్ల మానసముద్రలను (impresions) కూడ ఆయన గౌరవించేవాడు. ఆ మానస ముద్రలు ఆయన రచనల్లో కదలే అనుభూతులుగా మారటం జరిగింది.

వస్తువులు, మనుషులు, స్థలాలు, వీటిని నిశితపరిశీలన చేస్తాడు ఆయన. రూపం (form), ఆకృతి (shape) అనే వాటిని గురించి, వాటి సౌందర్యాన్ని, ఉపయోగాన్ని గురించి ఆయనకు గహనమైన అభిజ్ఞత ఉన్నది. గిన్నె అనేది నిత్యావసరాలకుపయోగపడే సామాన్య వస్తువు. ఎవరూ కూడ ప్రత్యేక శ్రద్ధచూపని సామాన్య గృహోపకరణం అది. కాని కృష్ణమూర్తి పరిశీలక దృష్టి ఆగిన్నె ఆకృతిని, రంగును, ఇంకా ఇతర విషయాలను గురించి రెండే రెండు వాక్యాల్లో వర్ణించకుండా ఉండలేక పోయింది.

''గిన్నె అంటే కేవలం ఆకృతి, రంగు, పరికల్పన మాత్రమేకాక గిన్నెలోపలి శూన్యత కూడ. గిన్నె అంటే రూపంలో పట్టుబడి ఉన్న శూన్యత. ఆ శూన్యత లేనిది గిన్నె లేదు. రూపమే లేదు.''

మానవ జీవితంలో శూన్యత అనేది దాని స్వంత ప్రాధాన్యతను కలిగి ఉంది. శూన్యంగా ఉన్న దేనిలోనైనా దేన్నయినా నింపవచ్చు. శూన్యం కాని దానిలో మన ఇష్టం వచ్చినదాన్ని దేన్నీ నింపలేము, కారణం అంతకుముందే ఆ శూన్య ప్రదేశం మనకిష్టమైనట్టీ, కష్టమైనట్టీ వివిధమైన వాటితో నిండి ఉంటుంది. మన కిష్టమైన వాటితో మాత్రమే దానిని నింపాలంటే దానిని ముందుగా ఖాళీచేయాలి. శూన్యమనేది ఒక నమూనా. దానిలో మన ముడిపదార్థాలను ఒక నిర్మిత ఆకృతి నిమిత్తం పోత పోస్తాం. శూన్యం నుంచే పూర్ణం ఉద్భవిస్తుంది. లోతైన ఎత్తైన ఆలోచనలు, సుందర ప్రాణస్పందనలుగల అనుభూతులు మొదలైనవన్నీ అవాంఛనీయ ఆలోచనలు లేని శూన్య మస్తిష్కం నుంచే ఉద్భవిస్తాయి. శూన్యంలేని గిన్నెకాని మరోపాత్ర కాని ఉపయోగంగా ఉండదు, సుందరంగాను ఉండదు. ఒక సామాన్యమైన గిన్నెను చూచిన తరువాత ఇటువంటి నిత్యసత్యం ఉదయించింది కృష్ణమూర్తిలో.

అసలు మనం శూన్యం అని దేన్ని అంటున్నామో నిజానికి అది శూన్యం కాదు. దృశ్యమాన శూన్యం అదృశ్య పదార్థంతో నిండే ఉంటుంది. ఏమీ కానిది అనేది ఏమీ కాకుండా లేదు, ఏదో ఒకటి అయి ఉన్నది. నిశ్శబ్దం నుంచి శబ్దం ఉద్భవించినట్లే, ఉన్నది అనేది లేనిదాని నుంచే ఉద్భవించింది. ఖాళీస్థలం అనేది ఖాళీస్థలం కాదు, ఖాళీలేని స్థలమే. సంస్కారయుతమైన మానసం సహాయంతో కన్ను కనుగొంటుంది శూన్యతలో పూర్ణతను.

ఆయనకు ఎదురయ్యే ఏ సామాన్యమైనట్టీ, అసామాన్యమైనట్టీ వస్తువుకూడ ఆయనలో రసానుభూతిని రేకెత్తిస్తుంది. దారివెంట కనిపించిన ఒక ఒంటరి పూవు. ఆయనలో ఎంతో ప్రతిస్పందనను కలిగిస్తుంది:

"దారివెంట ఒక్కపూవు కనిపిస్తుంది. అది నిర్మలంగా ప్రకాశవంతంగా ఆకాశం వైపుకు తెరుచుకొని ఉన్నది. సూర్యుడు, వానలు, రాత్రుల చీకటి, గాలి, ఉరుములు, భూమి, ఇవన్నీకూడ ఆ పూవు రూపొందటానికి భాగస్వాములైనాయి. కాని ఆ పూవు వీటిలోని ఏ ఒకటీ కాదు."

చాలా ప్రకృతి విశేషాలు ఆ పూవు ఆకారం దాల్చటంలో తోడ్పడినాయి కాని ఆ పూవు వాటిలోని వేటితో సారూప్యం లిగి లేదు. ఆ పూవు ఒక పూవు మాత్రమే. ఆ పూవు తాను బయటికి వచ్చిన భూమి కాదు, దానిని పెంచిన నీరుకాదు, గాలి కాదు; అది అదే. అది పూవే కాని పూవు కంటే భిన్నమైన మరొకటేదీ కాదు. అది చాలా చిన్నది, అయినా ఈ విశాల విశ్వంలో అదొక అద్భుత ఆవిష్కారం. బ్రహ్మాండంతో చుట్టబడి ఉన్న అదొక అండాండం. ఆ చిన్న పూవులో విశ్వరూపాన్నంతా చూడకలిగేడు కృష్ణమూర్తి. బృహత్తర రూపాలైన కొండలు, లోయలు, నదులు, సరస్సులు మొదలైనవాటిని మాత్రమే చూచి సంతృప్తి పడక ఒకే ఒక ఆకు, మొగ్గ, పూవు మొదలైన క్లోజప్ దృశ్యాలు చూడటంకూడ ఆయనకు ఆనందం.

కృష్ణమూర్తి కలంనుంచి మరొ ఖండిక, ఒక సజీవ గతిశీల నిసర్గ చిత్రం:

"అంతటితో సూర్యుడు కొండల శిఖరాలను అందుకొన్నాడు. సున్నితమైన, సుఖదమైన స్పర్శలో మంచు అంతా ఆ ప్రభాత కాంతిలో ప్రోజ్వలమైంది. ఆకులన్నీ రెపెరెప లాడసాగాయి. దీర్ఘరాత్రి అనంతరం, ఒక కుటీరంనుంచి పొగ పైకెగిరిపోతూంది. ఒక సెలయేరు నిరాటంకంగా ప్రవహిస్తూంది నెమ్మదిగా, అనుమానిస్తూ ముగ్ధమధుర లజ్జతో పర్వతాలు తమ సుదీర్ఘ ఛాయలను చిన్నకొండలమీద వేయటం, ఆ చిన్న కొండలు పచ్చిక బయళ్ళమీద వేయటం జరిగింది; చెట్లు ఆనీడల నిమిత్తం వేచి ఉండగా అవి త్వరలోనే అక్కడకు అందుకున్నాయి. తేలికవి, లోతయినవి, బరువైనవి, బరువు లేనివి. చెట్ల కొమ్మల నర్తనల మధ్య ప్రభాతం ప్రారంభమైంది."

పై వర్ణనలో కుటీరంలో నుంచి పొగలేవటం, నీడలు వ్యాపించటం, అనేవి ప్రధానాలు. ప్రభాతంలోని రహస్యమయ వాతావరణ, కుటీరం నుంచి ధూమ్రనీల వర్ణపు పొగలు ఆకాశం వైపుకు లేవటం అనేవి ఎన్నటికీ మరపురాని మనోహర దృశ్యాలు. కవికి, చిత్రకారునికి, మౌన రసజీవికి నీడలు అనేవి గొప్ప రసాత్మకపు విలువను కలిగి ఉంటాయి.

నీడ అనేది అసలు వస్తువుకంటే ఎక్కువ రమ్యంగా ఉంటుంది. వస్తువు లేంది నీడ ఉండదు. అయినా, అసలు వస్తువుకంటే దానినీడ ఎక్కువ శక్తిశాలిగా ఉంటుంది. కొన్ని వస్తువులు కదలవు కాని వాటి నీడలు కదులుతాయి. వస్తువు మార కుండా ఉంటుందికాని దానినీడ, బయటి కాంతి ననుసరించి ఎన్నో మార్పులను పొందుతుంది. ఒక పచ్చికబయలు మూల లోని ఒకే ఒక ఎత్తయిన చెట్టు యొక్క ఊదా నీడ మొత్తం పచ్చికబయలు లావ ణ్యాన్నే పెంచుతుంది.

సాధారణంగా నిర్లక్ష్య పరచబడుతున్న నీడల రసాత్మకపు విలువను కృష్ణమూర్తి బాగా ఎరుగు. అందుకే ఆయన తన రచ నల్లో వాటిని చిత్రించటానికి ఉల్లాస పడ తాడు.

ప్రతిబింబమూ, నీడా ఒకటికావు. ఒక వస్తువుయొక్క ప్రతిబింబం ఆ వస్తువుకు కేవలం ఒక ప్రతికృతి. కాని ఒక వస్తువు యొక్కనీడ దాని సృజనాత్మక ఆకృతి. ప్రతిబింబంలో ఒక వస్తువు యొక్క వాస్తవ రూపం మాత్రమేకాక దాని వాస్తవ వర్ణం కూడా కనిపిస్తుంది. దానికి తోడు ఇంకా ఇతర వివరాలుకూడా కనిపిస్తాయి. కాని నీడలో ఇటువంటి వివరాలు ఏమీ కనిపిం చక, రంగుకూడా కనిపించక అందులోని సృజనాత్మకత పెరుగుతుంది.

కృష్ణమూర్తి కవి అని, ఆయన చాలా కవితలను ముక్తఛంద ప్రక్రియలో రచించా డని ఇదివరకే చెప్పబడింది. ఆయన తన గద్యరచనలో వలెనే పద్యరచనలో కూడ ప్రకృతి లావణ్యాన్ని వర్ణించటంలో ఎప్పుడూ విసుగు చెందదు:

''వినండి,

నా ప్రియతమను గురించి గేయాన్ని
మీ ముందు గానం చేస్తాను.
ఎక్కడ నిశ్చల పర్వతాల పచ్చని ఏట
వాలులు
ఘోషిలుతున్న సముద్రపు మెరుస్తున్న
నీలజలాలను కలుస్తాయో
ఎక్కడ బుడగలు లేపే సెలయేరు
ఆనందంలో కరతాళిస్తుందో
ఎక్కడ కదలని కుంటలు నిర్మల గగ
నాన్ని ప్రతిబింబిస్తాయో
అక్కడ నీవు నాప్రియతమను కలుసు
కుంటావు
పర్వతాన్ని తన విశ్రాంతికోసం
వెదక్కుంటూ
మేఘం ఒంటరిగా వ్రేళ్లాడే లోయలో
ఆకాశానికి లేస్తున్న పొగలో
అస్తంగత సూర్యుని దగ్గరున్న పల్లెలో
అంతిమంగా అస్తమిస్తున్న సన్నని మెరు
పులలో
నీవు నా ప్రియతమను కలుస్తావు.''

– కార్లొ సారస్ రచించిన ''Krishnamurthi and the Unity of Man.

ఆ రోజుల్లో ఆయన ఒక 'ప్రియత మ'ను సృష్టించుకోవటంలో ఆనందం పొందేవాడు. ప్రియతమ అంటే ఇంగ్లీషులో ''Beloved' కనుక ఆ పదానికి ఆయన 'B' అనే పెద్ద అక్షరాన్ని వాడేవాడు. నిజంగా ఆ 'ప్రియతమ' ఎవరో స్వయంగా ఆయ నకే తెలియదు. అదొక అజ్ఞాత 'ప్రియ తమ'. ఎముకలు, మాంసం, రక్తం గల ప్రియతమ కాదు ఆ ప్రియతమ. అది పురు షుడు కాదు, స్త్రీ కాదు, వస్తువుకాదు, దేవుడుకాదు. మరి ఆ ప్రియతమ ఎవరు? ఆ ప్రియతమ కేవలం ప్రియతమే - ప్రియత

మతో చేయబడిన ప్రియతమే. ఆ ప్రియ తమ పేరు ప్రియతమ, రూపం ప్రియతమ; విశ్వసృష్టితో పోలికలేని ఒక విలక్షణ ప్రియ తమ. ఒకవేళ పొరపాటున ఆ ప్రియతమ దేనితో అయినా పోలిక కలిగి ఉండటం సంభవిస్తే అది కృష్ణమూర్తి పోలికను కలిగి ఉండటమే అవుతుంది.

ఇంతవరకు కృష్ణమూర్తి ప్రకృతిలోని దృశ్యమానమైన వాటి వర్ణన - రంగు, రూపం - ద్వారా మనను ఆనంద పర చాడు. ఇప్పుడు తిరిగి దాన్నే శ్రవ్యజగత్తు - సంగీతపు వర్ణన ద్వారా మనను ఆనంద పరుస్తాడు.

"ప్రాచీనమైన ఆ మహా వటవృక్షం క్రింద మురళి మ్రోగుతూంది. ఒక చిన్ని డోలువాద్యం దానికి సహకరిస్తుంది/మురళి ఆడోలు వాద్యాన్ని దాటి పరిసర వాతావర ణను నింపివేసింది. దాని సుకుమారమైన రాగాలాపన ద్వారా అది మనప్రాణంలోకి జారబడింది. ఇతర శబ్దాలు వినపడు తున్నా కూడా మనకు అది ప్రత్యేకంగా వినిపిస్తుంది. మురళి రవళి అలలద్వారా ఆ డోలువాద్యపు ఆనంద స్పందనలు మనను తాకుతున్నాయి. కాకి కూస్తున్న కఠిన శబ్దాలు ఆడోలు వాద్యం ద్వారా అందుతు న్నాయి. ప్రతి శబ్దం అంతరంగంలోకి చొచ్చుకపోతూంది; వాటిలో కొన్నిటిని మనం ఆపుతున్నాం, మరికొన్నిటిని ఆహ్వానిస్తున్నాం, ప్రీతిగా ఉన్నవాటిని, ప్రీతిగా లేనివాటిని. అదొక గొప్ప సౌందర్యం. సౌందర్యం అంటే ఆలోచ నకూ అనుభూతికి తెలియంది."

సంగీతాన్ని గురించిన పై ఖండిక స్వయంగా ఒక మాటలసంగీతం, శబ్దాలది కాకపోయినా. సంవేదన అన్నిటిలోకి శబ్దం అనేది ఎక్కువ నైరూప్యమైంది. కనుక అది మాటలు లేని శుద్ధ సంగీతం, గొప్ప నైరూ ప్యకళ. రూప జగత్తు స్థూలమైంది, శబ్ద జగత్తు నైరూప్యమైంది. మొదటిది చెందు తుంది స్థలానికి, రెండవది కాలానికి. కృష్ణ మూర్తికి స్థలం కాలం కూడా సమానంగా ప్రియమైనవే. అయినప్పటికీ ఆయన ఆరెం టికీ కూడ లొంగడు.

కృష్ణమూర్తి హేతువాది, స్వేచ్ఛాచింత కుడు, పరంపర వ్యతిరేకి. అయినా సూక్ష్మ రస జీవి. ఆయనది తన్మయీ హృదయం. అది స్పందిస్తుంది రూపపు లయకు, శబ్దపు రాగానికీ. ఆయన గానం చేస్తాడు:

"ఆనందిరచండి!
ఆ పర్వతాలమధ్య ఉరుముతుంది
లోయలోని ఆకుపచ్చని సుదీర్ఘ ఛాయలు ముఖాలమీదుగా వ్యాపించి ఉన్నాయి.
వానలు
పచ్చని మొసులను పైకి తెస్తాయి
నిన్న చచ్చిన దుబ్బులనుండి
చాలా ఎత్తున బండలమీద
ఒక గ్రద్ద తన గూడును నిర్మిస్తూంది
జీవంతో ఉన్న వస్తువులన్నీ గొప్పవి
మిత్రమ,
జీవంతో జగత్తు నిండి ఉంది
నీవూ నేనూ చిరంతన మిలనంలో ఉన్నాం."

(జిడ్డు కృష్ణమూర్తి నడిపిన "Ananda" అనే పత్రిక 1929 మే-జూన్ సంచికలోని కవిత.)

# కందుకూరివారి
# రాజశేఖర చరిత్రము

డా. ఎ. రమాపతిరావు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజశేఖర చరిత్రం వెలువడి ఇప్పటికి నూటపదమూడేళ్ళు కావస్తున్నది. అయినప్పటికీ తెలుగులో వచ్చిన పది మంచి నవలలు చెప్పున చెప్పమంటే రాజశేఖర చరిత్ర పేరు చెప్పక తప్పదు. తెలుగు నవల గొప్పతనం ఏమంటే మొట్టమొదటి నవలే గొప్ప మంచి నవల కావడం.

రాజశేఖర చరిత్రమే తెలుగులో వెలువడ్డ మొదటి నవలా? లేక నరహరి గోపాలకృష్ణమ్మ చెట్టి రచించిన శ్రీ రంగరాజు చరిత్ర మొదటి నవలా? అనే వివాదం అట్టే పట్టించుకోవలసింది కాదు. ఎందుకంటే మొదటి నవల అనే కీర్తి ప్రతిష్ఠలు, గణ్యత, మార్గదర్శకస్థానమూ రాజశేఖర చరిత్రకే లభించాయి కనుక. రాజశేఖర చరిత్రం వచ్చిన తరవాత నవలా రచనకు పూనుకున్న వాళ్ళందరూ దానినే తమకు మార్గదర్శకంగా ఎంచుకున్నారు. చింతామణి పత్రిక సుమారు నూరేళ్ళ నాడు మొట్టమొదటిసారిగా తెలుగులో నవలల పోటీలు నిర్వహించినప్పుడు నవలా రచయితలకు రాజశేఖర చరిత్రనే పథనిర్దేశకంగా చూపింది.

తరవాత కాలంలో సుప్రసిద్ధ నవలా రచయితగా గణుతికెక్కిన చిలకమర్తి లక్ష్మీనరసింహం రాజశేఖర చరిత్రను చదివే తాను నవల రాయడం నేర్చుకున్నానని స్వీయ చరిత్రలో చెప్పుకున్నాడు. నిజానికి చిలకమర్తి రామచంద్ర విజయానికి వీరేశలింగం రాజశేఖర చరిత్రానికీ చాలా దగ్గర పోలికలున్నాయి. తన నవల ప్రతి అధ్యాయమూ వీరేశలింగం రాజశేఖర చరిత్రను అనుసరించి చిలకమర్తి రాసినట్లు కనపడుతుంది.

అంతర్జాతీయమైన గుర్తింపును పొందిన తొలి తెలుగు నవల కూడా రాజశేఖర చరిత్రమే. రచయిత జీవిత కాలంలోనే ఇది రెండుసార్లు ఇంగ్లీషులోకి అనువాదం పొందింది. లండన్ టైమ్స్ పత్రిక రాజశేఖర చరిత్రను ప్రశంసిస్తూ సమీక్షించింది (1887). రాజశేఖర చరిత్ర వెలువడగానే పొరుగు భాష అయిన కన్నడంలోకి కూడా అనువాదం పొందింది. రెండో ముద్రణ రావడానికి పద్నాలుగు సంవత్సరాలుపట్టినా ఆ కాలపు 'హిందూ'లాంటి పత్రికలు ఎంతగానో మెచ్చుకున్నాయి ఈ నవలను.

ఇంచుమించుగా ఇప్పటికి 20 ముద్రణలు పొందింది రాజశేఖర చరిత్ర. ఇన్ని ముద్రణలు పొందిన తెలుగు నవల ఇంకొకటి లేదేమోననిపిస్తుంది. బహుశా కళాశాల స్థాయిలో పాఠ్యపుస్తకంగా నిర్ణీతం కావడంవల్ల కూడా ఈ నవల ఇన్ని ముద్రణలు పొంది ఉండవచ్చు. ఏది ఏమైనా రాజశేఖర చరిత్రం మొట్టమొదటిసారి వీరేశలింగం తన వివేకవర్ధని పత్రికలో ధారావాహికంగా 1878లో ప్రచురించినప్పటి నుంచీ నేటి వరకూ పాఠకులను, మేధావులను, సాహిత్యవేత్తలను, సంఘ సంస్కరణ భావాలున్న వారినీ అధికంగా ఆకర్షిస్తూనే ఉన్నది. గురజాడ అప్పారావు కూడా తన డైరీలో రాజశేఖర చరిత్ర గురించి ఎంతో ప్రశంసా పూర్వకంగా రాసుకొన్నాడు. కన్యాశుల్కం నాటకం ప్రథమాంకం

లోనే గిరీశం వెంకటేశానికి వేసవి శెలవులలో తాను పాఠం చెప్పాల్సిన పుస్తకాల జాబితాలో రాజశేఖర చరిత్రను కూడా చేర్చాడు. ఏమైతేనేం రాజశేఖర చరిత్రం వెలువడిన వెంటనే సాహిత్య పరులదృష్టిని ఆకర్షించిందనటం సారాంశంగా గ్రహిస్తే చాలు.

రాజశేఖర చరిత్రకు ఇటువంటి ఆకర్షణ కలగ టానికి కారణం ఏమిటి? ఆనాటి ఆంధ్రదేశాన్ని అత్యంత వాస్తవికంగా ప్రతిబింబింపచేసింది కనుక. ఆలివర్ గోల్డ్ స్మిత్ నవల 'ది వికరాఫ్ వేక్ ఫీల్డ్'ను వీరేశలింగం ఆధారంగా గ్రహించినా, ఆనాటి తెలుగుదేశానికి అనుగుణంగా కథాసంవి ధానాన్ని, పాత్రలను, వాతావరణాన్ని పూర్తిగా మార్చాడు. రాజశేఖరుడు గారి గృహవర్ణన మంతయూ ఇంచుమించుగా మా గృహవర్ణనమే అని కూడా ఆయన స్వీయచరిత్రలో చెప్పుకు న్నాడు. అంతేకాక వీరేశలింగం తాతగారికీ రాజ శేఖరుడు గారికీ చాలా పోలికలుకనపడతాయి. వీరేశలింగం జీవితంలో తటస్థపడ్డ స్వానుభావా లను కూడా సందర్భోచితంగా రాజశేఖర చరి త్రలో పొందుపరచడం ఆయన స్వీయ చరి త్రను, రాజశేఖర చరిత్రను జాగ్రత్తగా పోల్చి పరిశీలిస్తే తెలుస్తుంది. ఆ విధంగా ఈ నవలకు విశ్వసనీయత, వాస్తవికత అనితర సాధారణంగా లభించాయన్న మాట.

ఈ విధంగా వీరేశలింగంగారే ఈ నవలను గూర్చి చరిత్రలో ఇట్లా ప్రస్తావించారు. ''మొట్ట మొదటనొక చిన్న యింగ్లీషు ప్రబంధమును దేనినైనను తెలిగించి శైలి కుదురుపరచుకొని తరువాత స్వకపోలకల్పితమైన వచన ప్రబంధ మును వ్రాయబూనుకొనవలెనని తలచి గోల్డు స్మిత్తనెడి ఇంగ్లీషు కవి చేసిన 'వికర్ ఆఫ్ వేక్ ఫీల్డు' అను కథను తెనిగింపనారంభించి రెండు మూడు ప్రకరణములు వ్రాసితిని. విదేశీ కథయు దాని భాషాంతరమును మనవారికింపుగా నుండ వని తోచి, చేసిన భాగము నా మనస్సునకే తృప్తికరముగా నుండనందున దానిని మానివేసి రాజశేఖర చరిత్రము వ్రాయనారంభించితిని''

ఈ విధంగా వీరేశలింగం చెప్పినా సామాజిక సాహిత్యరంగాలలో వీరేశలింగంగారి ప్రబల ప్రత్యర్థి కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, రాజశేఖర చరిత్రము ఇంగ్లీషు నవలకు అనువాదమే అని నిరూపించడానికి చాలా తంటాలు పడ్డారు; పరిమాణంలో రాజశేఖర చరిత్రను మించిన విమర్శ గ్రంథం ప్రకటించారు. రాజశేఖర చరి త్రకు వివేక చంద్రిక అని నామాంతరం ఉండేది. అందువల్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు రాజశేఖర చరి త్రపై వెలువరించిన తమ విమర్శగ్రంథానికి వివేక చంద్రికా విమర్శనం అని పేరు పెట్టారు. తెలు గులో మొట్టమొదటి నవల రచనా ప్రయత్నమైన శ్రీరంగరాజు చరిత్రకు సోనాబాయి పరిణయం అని పేరుండేది. అందువల్ల రాజశేఖర చరిత్రకు వివేక చంద్రిక అని ఇంకోపేరు కూడా పెట్టారు పంతులుగారు. కాక ఈ రెండో పేరు నీవిధంగా కూడా సమర్థించవచ్చు. వీరేశలింగం నడిపిన వివేకవర్ధనిలో సుమారు రెండు సంవత్సరాలు ధారావాహికగా అచ్చైంది రాజశేఖర చరిత్రం. వివేకవర్ధనికి ఈనవల చంద్రికలాగా అంటే వెన్నె లలాగా అలంకారంగా ఉండేదనుకోవాలి. పాఠక చకోరాలు నిరీక్షించేవారేమో దీనికోసం. ఏది ఏమైనా తెలుగువారి వివేకవర్ధనంకోసం ఎంతో పాటు పడ్డాడు వీరేశలింగం. ఆనాటి సమాజం చాలా అవివేకంగా ఉండేదంటే ఇప్పుడు మన మేమీ బాధపడనక్కరలేదు. ఎటుచూసినా అవి వేక అంధకారమే వ్యాపించి ఉండేదనుకోవాలి.

తెలుగు నవల పుట్టిన తర్వాత మొదటి పాతిక సంవత్సరాలదాకా ఈ ప్రక్రియకు 'నవల' అనే పేరులేదు. వచనప్రబంధం అన్నాడు వీరేశ లింగం. నరహరి గోపాల కృష్ణమ్మచెట్టి నవీన ప్రబంధం అన్నాడు. తొలి ప్రయత్నమైన శ్రీరంగరాజు చరిత్రం ఐదు ఉల్లాసాల గ్రంథం. 88 పుటలలో కథ సరళంగా సాగదు. జానపద వీరసాహస గాథల వాతావరణంకూడా కనపడు

తుంది. అయితే నేటి సాంఘికాచారాల విమర్శ ఈ నవీన ప్రబంధంలో కొంతలో కొంత చోటు చేసుకోకపోలేదు. శ్రీరంగరాజు చరిత్రతో పోల్చినప్పుడు రాజశేఖరచరిత్రం శిల్పంలోనూ, కథా సంవిధానంలోను, సామాజిక వాస్తవికతా ప్రతిఫలనంలోనూ ప్రశస్తమైన రచన అని చెప్పక తప్పదు. పరిమాణంలో శ్రీరంగరాజు చరిత్రకు రెండింతల గ్రంథం రాజశేఖర చరిత్రము. 15 ప్రకరణాలలో కథ మొదలుపెట్టినప్పటి నుంచి ఉత్కంఠాభరితంగా సాగుతుంది. ఈ నవల మళ్ళీ ఇంగ్లీషులోకి అనువాదం పొందడం కూడా దీని మౌలిక ప్రతిభను చాటిచెపుతున్నది. అదీకాక నూటపదమూడేళ్ళుగా తెలుగు వారిని ఆకర్షిస్తూనే ఉన్నది. అలరిస్తూనే ఉన్నది. శ్రీరంగరాజు చరిత్రము వెలువడిన పదిహేను ఇరవై సంవత్సరాలలోనే విస్మృత ప్రాయమై పోయింది. వీరేశలింగంగారు నరహరి గోపాల కృష్ణమ్మచెట్టిగారి శ్రీరంగరాజు చరిత్రను చదివినట్లూ, అందులోని సాంఘిక విమర్శను తామూ ఆదర్శంగా స్వీకరించినట్లూ కనపడుతుంది. అందువల్ల శ్రీరంగరాజు చరిత్రను వీరేశలింగం అనుకరించాడనకూడదు. నన్నయ్యగారికి ముందు శాసనాలలో తెలుగు పద్యరచన కనపడుతూనే ఉన్నా నన్నయ్యగారినే ఆదికవి అన్నట్లు, ఆధునిక సాహిత్యానికి మూలపురుషుడు వీరేశలింగమే కాబట్టి నవలా శాఖనుకూడా తెలుగు సాహిత్యంలోనే ఆయనే దిద్ది తీర్చాడనటంలో తప్పులేదు.

రాజశేఖర చరిత్రంలో స్వీయ జీవితానుభవం నుంచి వీరేశలింగం ఎన్నో సన్నివేశాలను సృష్టించాడు. పాత్రలు రూపొందించాడు. ఆనాటి సమాజంలోని అనేక సంగతులు ఎత్తిచూపాడు. నోములు, వ్రతాలు, గోళ్ళు, గోపురాలు, శకునాలు, శాంతులు, ప్రయోగాలు, భూతవైద్యం, మతాధిపతుల దంభం, ఎరుకలు, సోదెలు, వెలిపత్రికలు, మతం పేరిట, ఆధ్యాత్మికత పేరిట మోసాలు, దౌర్జన్యాలు, కపటసాధువులు, దారిదోపిళ్ళు, సందర్భానుసారంగా ఆకాలంనాటి పరిస్థితులను ఈనవలలో ఆయన చిత్రించాడు.

రాజశేఖర చరిత్రం చక్కని కథాసంవిధానం గల 15 ప్రకరణాల నవల. సరళమైన శైలి. కుతూహలాన్ని పోషిస్తూ చదివిస్తుంది. రాజశేఖర చరిత్రలోని నృసింహస్వామి కాశీయాత్ర మొదలైన ఘట్టాలలో వీరేశలింగం పంతులుగారి బాల్య జీవితానుభవాలు పొందికగా అనుసంధానించారు. ముష్టి సర్వశాస్త్రి, నంబిరాఘవాచార్యులు, బొమ్మకంటి సుబ్బారాయుడు, పెద్దాపురంలో యంత్ర తంత్రాలు తెలిసిన వీరదాను, స్వయంపాకం తప్ప ఇతరత్రా భోంచెయ్యనని గప్పాలు కొట్టే బులుసు పేరయ్య సోమయాజులు అంతాపూర్తిగా ఆకాలపు తెలుగువాళ్ళ ప్రతినిధులు. గోదావరి వర్ణన, పిఠాపురం సంస్థానం, శంకర మఠాధిపతుల సంచారాలు, వైష్ణవ స్వాముల శిష్య సమాశ్రయణ పర్యటనలు, ఇవన్నీ ఆనాటి తెలుగుదేశపు సామాజిక వాతావరణాన్నే ప్రతిబింబిస్తున్నాయి.

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు తన గద్దురోజులు అనే నవలలో ఒక ప్రస్తావనలో కథానాయకుడు రాజశేఖర చరిత్ర చదివి ఎంతగా ప్రభావితుడైనదీ వర్ణించారు. తెలుగులో సర్వాంగ సంపూర్ణమైన, శిల్ప విషయకంగా కూడా చెప్పుకోదగిన పరిణతితో కూడిన నవలా రచన రాజశేఖర చరిత్రతోనే ప్రారంభమైందని చెప్పవచ్చు. 1894లో అంటే మొదటి ముద్రణ వెలువడిన 14 సంవత్సరాలకు రాజశేఖర చరిత్రం ద్వితీయ ముద్రణం వెలువడింది. ఆప్రాంతాలలోనే రాజశేఖర చరిత్రంమీద కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి విమర్శ వివేక చంద్రికావిమర్శనం కూడా వెలువడింది. ఆరోజుల్లోనే తెలుగులో మొట్టమొదటిసారి నవలా రచనపోటీ కూడా ప్రారంభమైంది. న్యాపతి సుబ్బారావు గారు వీరేశలింగం పంతులుగారి సహాయంతో నిర్వహిస్తూ వచ్చిన చింతామణి అనే సాహిత్య

మాసపత్రికలో ఈపోటీలు ప్రారంభమైనాయి. న్యాయ నిర్ణేతలలో వీరేశలింగం ఒకరు. మొదటి రోజుల్లో నవలను వచన ప్రబంధంగా భావించ టంవల్ల శృంగార వీర అద్భుత గాథాత్మకంగా ఉండాలి నవలారచనం అని ఆతరం సాహిత్య త్తలు భావించినట్లుగా కనపడుతుంది. ఇందుక నుగుణంగానే తొలిదశలో వెలువడిన నవలలకు చరిత్రము, విలాసము, విజయము, మొదలైన పేర్లు జోడించేవారు రచయితలు. మొదటి మూడు నవలలకు చరిత్రము అనే పేరుంటే పోటీ నవలల్లో మొట్టమొదటి బహుమానం పొందిన నవలపేరు ధర్మవతీ విలాసము. చిలక మర్తి నవల రామచంద్ర విజయము. ఈ చరిత్ర, విలాసము అనేపేర్లు పాతకాలపు ప్రబంధాల పేర్లనే తలపుకు తెస్తున్నాయి.

వచనప్రబంధం అనే పేరుపోయి పాతికేళ్ళ తర్వాత ఈ ప్రక్రియకు నవల అనే పేరే వచ్చింది. ఆ తర్వాత నూరేళ్ళలో సుమారుగా పద్దెనిమిది ముద్రణలు పొందింది రాజశేఖర చరిత్రము. పుస్తకంగా వెలువడ్డ ఏడేళ్ళలోనే లండన్ నుంచి ఇంగ్లీషు అనువాదంగా కూడా వెలువ డటం ఈనవల విశిష్టత. పాశ్చాత్య పండితులు రాజశేఖర చరిత్ర ఇంగ్లీషు అనువాదాన్ని చదివి ఇట్లా ప్రశంసించారు. "Written by a native gentleman of refinement and education, the book is fine and invaluable as an impartial study of native character as seen by native eyes." ఇంగ్లీషులో దీనిని అను వదించిన రెవరెండ్ హచ్చిన్సన్‌గారు ఈ నవ లకు 'ఫార్చ్యూన్స్‌వీల్' (అదృష్టచక్రము) అని పేరుపెట్టారు. అప్పట్లో మద్రాసు రాష్ట్రానికి విద్యాశాఖ తొలి డైరక్టర్‌గా పనిచేసినవారూ, రాజశేఖర చరిత్రము అంకితం పొందినవారూ అయిన జనరల్ మెక్డనాల్డ్‌గారు ఇంగ్లీషు అనువా దానికి ప్రశస్తమైన పీఠిక వ్రాశారు.

వీరేశలింగం పంతులుగారు రాజశేఖర చరిత్ర రచించడంలో ప్రధానోద్దేశం ఆనాటి సాంఘిక దురాచారాలను, మూఢ విశ్వాసాలను, కపటా లను, మోసాలను విమర్శించడం. అంతేకాని కావ్య సౌందర్యం, రసదృష్టి వినోదమూ ఎంత మాత్రమూ కావు. ఆనాటి సంఘాన్ని ఉన్నదు న్నట్లుగా ఆయన చిత్రించాడు. రాజశేఖరుడి గారి అమాయకత్వం, అవివేకం, ముఖస్తుతులకు ఉబ్బిపోవడం ఆయన అనుభవించిన అనర్థాలన్ని టికీ కారణమైనాయి. ఆయనలో పెద్ద బలహీనత ముఖస్తుతులకు ఉబ్బితబ్బిబ్బు కావడం. అయితే క్రమంగా కథముందుకు సాగినకొద్దీ గోటేటి రాజశేఖరుడుగారు కందుకూరి వీరేశ లింగంగారిలా పరివర్తనం పొందటం కనపడు తుంది. రాజశేఖరుడుగారు తమ జీవితానుభవా లతో క్రమ క్రమంగా హేతువాదిగా రూపాంతరం చెందుతారు. సంఘ సంస్కారంపట్ల సౌము ఖ్యమూ, మానవత్వ విలువలను కాలరాచే ఆచార, సంప్రదాయాలపట్ల నిరసనమూ ఆయన ఈ కథ ముగింపులో వ్యక్తపరుస్తాడు.

మధ్యయుగాల సాంఘిక జీవనచక్రం ఇంగ్లీషు చదువుల ప్రభావంవల్ల క్రమంగా ఏవి ధంగా మార్పుచెందుతున్నదో నిరూపించే ఆధునిక తెలుగుసాహిత్యం రాజశేఖర చరిత్ర తోనే ప్రారంభమైంది. వీరేశలింగం సాధించిన, సాగించిన మానవీయ సాహిత్యోద్యమానికి రాజశే ఖర చరిత్రం వేగుచుక్క వంటిది. ఆయన పద్యకవిగా కాక వచన రచయితగా ఆధునిక సాహిత్యాన్ని ఏవిధంగా సుసంపన్నం చేయబో తున్నాడో రాజశేఖర చరిత్రం పథనిర్దేశం చేస్తుంది. కుటుంబంలో యజమాని ఏవిధంగా సంసారాన్ని నిర్వహించుకోవాలో, సంస్కా రాన్ని పెంపొందించుకోవాలో రాజశేఖరుడిగారి పాత్రచిత్రణ ద్వారా ఆయన లోకానికి సందేశం అందించారు. అదేవిధంగా స్త్రీ ఏవిధంగా కుటుంబ జీవనంలో కీలకపాత్ర వహించాలో సత్యవతీ చరిత్రంద్వారా ప్రబోధించారు.

రాజశేఖర చరిత్రం రచించేనాటికి వీరేశ లింగం పంతులుగారి వయస్సు ముప్పై ఏళ్ళు

అప్పటికి ఆయనకు పూర్వకాలపు విశ్వాసాలు, భావాలు అన్నీ మారిపోయినాయి. అప్పటికే నాలుగు సంవత్సరాలనుంచీ ఆయన వివేకవర్ధని పత్రికను నడుపుతున్నాడు. అగ్రవర్ణాల దయనీయ జీవితాన్ని, ప్రభుత్వ పరిపాలనా శాఖల్లోని అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని, బంధుప్రీతిని, న్యాయవాదుల అన్యాయాలను, దురాగతాలను బ్రాహ్మవివాహం, వ్యవహార ధర్మబోధినివంటి ప్రహసనాలద్వారా అప్పటికే ఆయన లోకానికి వెల్లడించి ఉన్నాడు. కోర్టు వ్యవహారాలలోకూడా తలమున్కలుగా ఉన్నాడు.

రాజశేఖర చరిత్రంలో సంగ్రహంగా కథ ఇది. అఖండ గోదావరినది ఒడ్డున ధవళగిరి అనే చిన్నగుట్టా, దాని పాదతలంలో ధవళేశ్వరం అనే ఊరు ఉన్నాయి. ఆ ఊళ్ళో గోటేటి రాజశేఖరుడుగారు స్థితిమంతుడైన గృహస్థు. ఆయన వయస్సు నలభై ఏళ్ళు. ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకు, తలచెడిన చెల్లెలు (పినతల్లికూతురు), ఆయన భార్యా, ఆయన కుటుంబ సభ్యులు. రాజశేఖరుడిగారి మంచితనాన్ని ఆసరా చేసుకొని ఆ ఊరివాళ్ళంతా ఆయన్ను పొగడి ధనార్జన చేస్తూ ఉంటారు. ఆయనే తమకుదిక్కు అన్నట్టూ, ఆయన లేకపోతే ఆ ఊళ్ళోనే ఉండేవాళ్ళం కామన్నట్లు ఆయన్ను రకరకాల ముఖప్రీతులతో సంతోషం పచేస్తుంటారు. ఊళ్ళో పురోహిత వర్గానికిచెందిన సిద్ధాంతి, రామశాస్త్రి, జోస్యుల కామావధాని మొదలైన వాళ్ళంతా ఆయనకు ఆశ్రితులుగా ధనసంగ్రహణం చేస్తుంటారు. ఆ సిద్ధాంతి మోసగాడు అని మొదటిప్రకరణంలోనే అర్థమవుతుంది. ధవళేశ్వరం ఊరిబయట ఎవరో బైరాగివచ్చి ఉన్నాడని ఒకరోజు గోదావరి స్నానానికి వచ్చిన రాజశేఖరుడిగారికి ఆయన ఆశ్రితులైన రామశాస్త్రి సిద్ధాంతి మొదలైనవాళ్ళు చెబుతారు. ఇది మొదటి ప్రకరణం.

రెండో ప్రకరణంలో రాజశేఖరుడిగారి కుటుంబ సభ్యుల పరిచయం అవుతుంది. ఆయన పెద్దకూతురు రుక్మిణి గోదావరికి స్నానానికి వచ్చినప్పుడు ఊరిలోని అమ్మలక్కలంతా ఆమెచుట్టూచేరి ఊరివిషయాలు ముచ్చటిస్తారు. ఆమెకు పధ్నాలుగేళ్ళు. సిద్ధాంతిగారి భార్య తనకూతురుని చచ్చిన మగడు దయ్యమై పీడిస్తున్నాడనగా రుక్మిణి ఆమెతో మీవారు గ్రామంలో పెద్దసిద్ధాంతులుగారు గదా అంత అర్థాయుష్యవువాడికిచ్చి పెళ్ళి చేశారేమి అని తర్కం లేవనెత్తుతుంది. అంటే జాతకాలు బూటకాలు అని పంతులుగారు రుక్మిణిచేత చెప్పిస్తున్నారన్నమాట. మూడవ ప్రకరణంలో రాజశేఖరుడిగార్ని ఇంట్లో ఎక్కడెక్కడివాళ్ళో పడితింటూ ఆయన్ను పొగడ్తలలో ముంచెత్తడం కథాభాగం. ఊళ్ళో జనార్దనస్వామి ఆలయం పూజారులువచ్చి ఉత్సవాలు చేయాలని ఆయన దగ్గర విత్త సంగ్రహం చేస్తారు. నాలుగో ప్రకరణంలో రాజశేఖరుడుగారిని ఆఊళ్ళోనే ఉన్న మిత్రులు ఏవిధంగా మోసగిస్తున్నారో అవిషయం వర్ణితం. ఎరుక చెప్పేవాళ్ళు, జాతకాలు చెప్పేవాళ్లు ఏవిధంగా అబద్ధాలు చెపుతుంటారో ఈ ప్రకరణంలో సంఘటనలద్వారా వివరించారు పంతులుగారు. తమ పినతల్లి కూతురు, ఇంట్లో వంటావార్పులుచేసే సుబ్బమ్మకు అస్వస్థత కలిగింది కాబట్టే బైరాగిని వెంటబెట్టుకొని రావలసిందని నంబి రాఘవాచార్యులకు చెపుతాడు రాజశేఖరుడుగారు. ఇంతలో జనార్దనస్వామి రథోత్సవం చూడటానికి వెళ్ళిన రుక్మిణి కాసులపేరు, సందడిలో ఎవరో దొంగిలిస్తారు. ఇది అయిదో ప్రకరణం. ఆరోప్రకరణంలో హరిశాస్త్రులనే భూత వైద్యుడి కపటం వర్ణిస్తారు వీరేశలింగం. గిట్టనివాళ్ళెవరో రుక్మిణి మగడు చచ్చిపోయినాడని నీలివార్త తెస్తారు. దాంతో రుక్మిణికి మనోవ్యాధి పట్టుకుంటుంది. బైరాగిని ఇంటికి రప్పించి ఇంట్లో ఉండమం

టారు రాజశేఖరుడుగారు. బైరాగి ఉపాయంగా ఇంట్లో వెండిబంగారాలు మూటకట్టుకొని పలా యనం చిత్తగిస్తాడు. రాజశేఖరుడుగారు బీద వాడై ఊళ్ళో ఉండలేక ఊరు విడిచిపెడతాడు. బంధుమిత్రులంతా ఆయనను వంచిస్తారు. ఎని మిదో ప్రకరణంలో రాజశేఖరుడు ఆలుబిడ్డలతో ప్రయాణమై వెళుతుండగా ఆయన్ను దొంగలు దోచుకుంటారు. రాత్రిపడుతుంది. పులి ఎదుర వుతుంది. రుక్మిణి సొమ్మసిల్లి పడిపోతుంది. ఆమె మరణించిందని దుఃఖించి పెద్దాపురం చేరు తారు రాజశేఖరుడుగారు. సంసారం జరగక పెద్దకొడుకును పీఠాపురం పంపిస్తారు రాజశేఖరు డుగారు. పెద్దాపురంలో ఉండగా దుర్మార్గులు రాజశేఖరుడిగారి కూతురు సీతను అపహరించు కొని పోతారు. పెద్దాపురంలోని కారాగృహాధికారి రాజశేఖరుడుని కారాగారంలో బంధిస్తాడు ఆయన తనమాట వినలేదని. అటు తర్వాత ఐదు ప్రకరణాలలో లోకంలోని మోసాలు, కప టాలు, ఘరానాదొంగతనాలు, ప్రజల మూఢవి శ్వాసాలు సందర్భానుసారంగా విమర్శిస్తారు పంతులుగారు. పెద్దాపురం మహారాజైన కృష్ణజగ పతి మహారాజు రామరాజు అనే గూఢనామంతో తనప్రజల కష్టనష్టాలు తెలుసుకోవటానికి మారు వేషంతో సంచరిస్తూ ఒకకన్ను రాజశేఖరుడిగారి కుటుంబంపై వేసి ఉంచడంవల్ల చివరకు కథ సుఖాంతమవుతుంది. చనిపోయినదనుకున్న రుక్మిణి, దొంగలెత్తుకొనిపోయిన సీత ఇంటికి చేరుతారు. చనిపోయాడనుకున్న నృసింహస్వా మికూడా ఇల్లుచేరుకుంటాడు. తన కష్టాలవల్ల నిజానిజాలు తెలుసుకొని రాజశేఖరుడు బుద్ధి తెచ్చుకుంటాడు. ఈవిధమైన కథలో ఏ చిన్న సందర్భం వచ్చినా సన్నివేశం వచ్చినా లోకం లోని వంచనలను, అహేతుకమైన మూర్ఖ విశ్వా సాలను, సాధుసన్యాసుల దుర్వర్తనను, భూతవై ద్యుల కపటాలను నిశితంగా విమర్శించారు వీరేశలింగం పంతులుగారు. నిజానికి గురజాడ కన్యాశుల్కానికి దీటువచ్చే రచన కందుకూరి వీరేశలింగం పంతులుగారి రాజశేఖర చరిత్రం.

★ ★ ★

కావ్యజగత్తు సామాజిక జగత్తునుంచి ఉత్పన్న మయ్యేదే కాని అలౌకికమైనది కాదు. కావ్యజగ త్తులో ఆనందం ప్రధానం, సామాజిక జగత్తులో కాదు. సమాజంలో ఎలా ఆనందం కలుగుతుందో ఆవిధానాల ననుసరించే కవి తన అనుభూతిని మార్పుచెయ్యక చిత్రిస్తాడు. ఇలాంటి కావ్యజగత్తు సామాజిక జగత్తుతోపాటే మారుతూ వుంటుంది. సామాజిక జగత్తునుండి కావ్యజగత్తును వేరుచేసి చూస్తే ఆయోమయంగా, అర్థరహితంగా, మంచి చెడ్డాలేక, ఎందుకో, ఎందుకో, దేనికో దేనికోగా ఉంటుంది

శ్రీ జి.వి.కె.
కావ్యజగత్తునుండి

★ ★ ★

కీ.శే. కొండవీటి వెంకట కవి నుద్దేశించి వ్రాసిన

# ఎలిజీ

డా॥ వి.వి.యల్. నరసింహారావు

సంస్కృతాంధ్ర సాహిత్యక్షేత్రాలు అర్ధశతాబ్దం దున్ని
క్రొక్కారు తెలుగుపంటలు పండించిన కొండవీటి కలం హలం
మొక్కపోయిందా? ముక్కలైందా? మంటిలో కలిసి పోయిందా?
గుంటూరు మండలం తెలుగుగడ్డ-తొలినాటి తెలుగు శాసనం పురిటిగడ్డ-
విప్పర్లగ్రామం కన్నబిడ్డ-తెలుగుపంట కాణాచి కావడం వింతేముంది?
శేషాంబా నారాయణ దంపతుల నోముపంట విఫలమౌతుందా?
గురుపాదులు - గుదిమెళ్ళ, చెళ్ళపిళ్ల, వజ్ఝల, దువ్వూరి
వేసిన భాషా సాహితీ వ్యాకరణ బీజాలు వితపోతాయా?
చిన్నప్పుడు తండ్రిచెప్పిన పెద్దబాలశిక్ష, పెద్దప్పుడు భట్టుమూర్తి పెట్టిన ప్రౌఢసాహితీభిక్ష
వృథ పోతాయా?

వసుచరిత్రకు వెయ్యి పుటల సుదీర్ఘ భాష్యం వ్రాయాలన్నావు;
అది గుండెలో గుబగుబలాడుతూ అక్షరరూపం తాల్చకుండానే

శంకరుల పంచీకరణసూత్రం నీచేతిలో ప్రపంచీకరణ భాష్యమై వెలసింది
శ్రుతి స్మృతి వేదాంత వేదాంగ పురాణ కావ్యాంభోధి మథించి
హాలహాలం మింగి అమృతం అఖిల జనానికీ పంచాలన్న దేశికుడివి;
ముగ్గులోకి దిగితే కవిరాజు లిద్దరుకారు; నీతో ముగ్గురని నిగ్గుతేల్చావు.
ముప్పై మూడేళ్ళ దేశికవృత్తిలో ప్రవృత్తికంటే నివృత్తినే పండించుకున్నావు.
వాత్సల్యం నిండిన వైరాగ్యం నీలోనే చూచాము కవీ!
హిమాలయమంత ఎత్తెదిగిన నువ్వు గుణ పక్షపాతంతో
పిన్నలపట్లకూడా చూపే నయవినయాలు విస్మయం కలిగిస్తాయి.
నవభారత నిర్మాత నెహ్రూ చరిత్రని కావ్యీకరించి అజరామరం చేశావు.
నిజానికి నీ 'రాజర్షి' కావ్యంలో నువ్వే కనిపిస్తావు నాకు!
''ఎవడురా ఆ అగ్ని నాబిడ్డను పరీక్షించేందుకు?''
అన్న జనకరాజర్షి ధర్మావేశం చూస్తాము నీలో
'కవిభూషణ' 'కవిరాజు' 'ప్రజాకవి' 'కళాప్రపూర్ణ' బిరుదాలు

కనకాభిషేక గండపెండేర కవితాబ్రహ్మోత్సవాలు
నీ విలీతిని పెంచాయేకాని అహంత వణుమాత్రం పెంచలేదు,
అదే మా కొండవీటి గొప్పతనం అనుకుంటాం.
కర్ణుడి దానవీరం, ఏకలవ్యుడి ధర్మవీరం,
విశ్వనాథుడి రాజభక్తి, తాండ్రపాపయ త్యాగవీరం,
స్వామి వీరబ్రహ్మేంద్రుడి సర్వమానవ సమతావాదం

చిత్రవిచిత్ర వాక్కుల్లో వెండితెర కెక్కించావు
బ్రహ్మంగారిమఠం ఆస్థానకవి పదవికి అపూర్వగౌరవం తెచ్చావు
పదవులకోసం ప్రాకులాడని నిస్వార్థం నీది;
వచ్చినపదవుల్ని విధిబద్ధంగా నిర్వహించిన నిజాయితీ నీది;
ఈనాడు గురుశిష్యుల సంవాదం నడిపినా
పరదేశిపాఠం పలికినా, రామావతార తత్వం చెప్పినా

అధికారభాషకు ఆసరాగా నిలిచినా, నీవల్ల వచ్చింది పదవికి గౌరవం.
పద్దెనిమిదేళ్ల పడుచుప్రాయంలోనే సన్యాసం స్వీకరించావు
గురుకారణ గురుపీఠాదులు గృహస్థువై అలంకరించావు;
డెబ్బైయేళ్లు నిండిన వార్ధకంలో కూడా అర్ధాంగిని ఆవిడ అని యెరగవు
సతీమణిని 'సోమిదమ్మ' అనే సత్కరించావు! ఔను!
జీవితమంతా సాహితీయజ్ఞంగా జరిపిన సోమయాజివి
శ్రీమతిని 'సోమిదమ్మ' అనక ఏమంటావు?

దూరదర్శనంతో నిజం చెయ్యాలనుకున్న స్వప్నం
'వాసవదత్త'గా మాటల్లోకి మలిచేందుకు
నన్నుతోడు చేసుకున్నావు; నామాటలో మాట కలిపావు;

బుల్లితెరకు నేవ్రాసిన ''సమ్రాట్ శాతవాహన'' విని
నాచేతిపై నీవు పెట్టిన ముద్దుతడి ఇంకా ఆరనే లేదే!
'వెండితెరమీద వాగేశ్వరుడు నాగార్జునుడైతే
మనిద్దరం కలిసి మాటలు పలకా'లన్న నీమమత మర్చిపోగలనా?

మాటలతో మంత్రాలతో పలుకుతో పాఠాలతో
ప్రజాకోటికి ప్రాణవాయువు లూదిన నీవు
అంతిమఘడియల్లో ఆసుపత్రిలో ప్రాణవాయువుకోసం అల్లాడిపోతుంటే
నిన్ను ఓదార్చాలని వచ్చిన నాకళ్లు తుడిచి నన్ను ఓదార్చావు!
ఎన్ని 'ఎలిజీలు' వ్రాసి నీఋణం తీర్చుకోగలను వెంకటకవీ!

# మధురవాణితో శ్రీశ్రీ

(ఇంటర్వ్యూ/ఊహాజనితం)

– పురాణం సుబ్రహ్మణ్యశర్మ

మధురవాణి : శ్రీశ్రీగారూ మీరు వెజిటేరియనా, నాన్ వెజిటేరియనా?

శ్రీశ్రీ : ఫస్ట్ థింగ్స్ ఫస్ట్ వేరీజ్ మై డ్రింక్? అసిరిగాడ్ని బజారుకి పంపించి ఇన్‌స్ట్రుమెంట్స్ అన్నీ రెడీ చెయ్యి –

మధురవాణి : అంటే –

శ్రీశ్రీ : చికెన్ బిర్యానీ, మటన్ ఫ్రయి, ఆమ్లెట్ తెప్పించు. రైస్, రెండు కప్పుల కర్డ్ చాలు సరిపోతుంది.

మధురవాణి : చలసాని ప్రసాద్‌గారొచ్చాడు. అసిరిగాడ్ని పంపద్దు. అన్నీ తనే తెస్తానంటున్నాడు.

శ్రీశ్రీ : ఏం?

మధురవాణి : అసిరిగాడు మందులో నీళ్ళు కలిపేస్తాడ్ట, కొంత వాడు తాగేసి. పైగా ఫుడ్ లో మరికొంత లాగించేస్తాడని భయంట. కమీషన్ కింద ఒకటీ రెండూ మింగేస్తాడ్ట.

శ్రీశ్రీ : సరే – నా మందు నన్ను త్రాగనివ్వరు. నా కవిత్వం నన్ను రాయనివ్వరు. ఏమంటాడు ప్రసాద్?

మధురవాణి : నిన్న మీరు ఫుడ్ మరకలు డ్రింకు మరకలు చేసుకున్న మాసిపోయి డాగులు పడ్డ లాల్చీ పైజమ్మాతో వచ్చార్ట. కొత్త బట్టలు తెచ్చాడు. మీరు నిన్నా మొన్నా స్నానం చేయలేదట. మంగల్ని పిలిచి మీకు శుభ్రంగా తలంటోసి స్నానం చేయించి కొత్త బట్టలు కట్టించి ఆ పిమ్మట ఇంటర్వ్యూ తతంగం సాగించమంటున్నాడు చలసాని ప్రసాద్.

శ్రీశ్రీ : కవికి స్వేచ్ఛ లేకపోవడమంటే యిదే. తలంటూ గిలంటూ జాంతానై. నేనిలాగే వుంటాను. కానియ్ నీ ఇంటర్వ్యూ...

మధురవాణి : పోనీ గిరీశంగారి నైట్‌డ్రస్ వుంది అది ధరిస్తారా?

శ్రీశ్రీ : వాడి నైట్‌డ్రస్ నేనా? నీకిది న్యాయమా మధురవాణీ – నాలో గిరీశం పోలికలు నువ్వేం చూశావ్?

మధురవాణి : ప్రతి వ్యక్తిలోనూ ఒక గిరీశం దాక్కొని వుంటాడు – కనుక్కోవాలి అంతే (నవ్వుతుంది).

శ్రీశ్రీ : నీ పెంకి నవ్వు కన్యాశుల్కంలో సావిత్రి ట్రయ్ చేసింది. ఎలా వుంది?

మధురవాణి : నా నవ్వు పట్టుపడాలని కరటక శాస్త్రి శిష్యుడు ట్రయి చేశాడు (ఆ) అవునూ సావిత్రి చేత ఆనందం అర్ణవమైతే పాడించారు సినిమాలో – అదేవిటండీ?

శ్రీశ్రీ : నామీద గౌరవం కొద్దీ వాళ్ళా పాట పెట్టారు.

మధురవాణి : ఆ పాట నామీద గౌరవం లేకా వాళ్ళు పెట్టింది!

శ్రీశ్రీ : లుబ్ధావధాన్లు పెళ్ళిలో నువ్వయితే ఏం పాడేదానివి?

మధురవాణి : పెళ్ళి తప్పించడానికి పెళ్ళి గాని అదేవన్నా నిజం పెళ్ళా – ఏ పాట పాడితే నేవిటి?

శ్రీశ్రీ : అమ్మయ్య నన్ను బతికించావు. అబద్ధ ప్పెళ్ళిలో ఆనందం అర్ణవమైతే పాడితేనేవిటి, అపనా తనా మనా పాడితేనేవిటి?

మధురవాణి : తరంగానో, అష్టపదో, జావళీనో అందుకునేదాన్ని నేనైతే – మరీ పులి చంపిన లేడి నెత్తురు అంటే ఏవిటండీ?

శ్రీశ్రీ : వెరీ సింపుల్ – యిందులో అర్థం కాకపోవడానికేం వుంది?

మధురవాణి : మీ కవిత్వానికి పులి చంపిన లేడి నెత్తురు కావాలన్నార్ట! అదేం కోరిక?

శ్రీశ్రీ : ఎవడా వుండాకోర్ – నీచేత యిటువంటి ప్రశ్నలడిగిస్తున్నది – వాడిపేరు చెప్పు?

మధురవాణి : మీ కామ్రేడే, నిత్యకవి. పులి చంపిన లేడి నెత్తురు కావాలోయ్ నవ కవనానికి అన్నాడు మీ మహాకవి. పులి లేడిని చంపడం హృదయవిదార కమైన సంగతి కదా – అటువంటి నెత్తురు కావాలనడం బీభత్సం అవునా? నేనైతే యిలా రాస్తానా అని వాపోయాడు పాపం!

శ్రీశ్రీ : నేనూ...అర్థం కాలేదు, నా మహాప్రస్థానం అర్థం కాలేదు వాడికి? పోనీ నువ్వు చెప్పు –

మధురవాణి : ఏవుంది తెల్లబియ్యం పాటే మానికా – పులి చంపిన లేడి నెత్తురు పులిమీద తిరగబడమని లేళ్ళకు చెబుతుంది. కార్మికులు పులుల్లాటి యజమానుల మీద తిరగబడాలి అని సందేశం.

శ్రీశ్రీ :నా పద్యం ఓటి జ్ఞాపకం వస్తోంది విను.

కుకవియన నా మతంలో
ఒకడే, తన గొప్ప యెదిరి న్యూనత చూసే

వికలమతి! వానిపైనా
చికటారిని నూరదలతు సిరిసిరిమువ్వా!

మధురవాణి: మీరు సినిమా పాటలు చక్కగా రాశారు గదా – అందులో 'నా హృదయంలో నిదురించే చెలీ' అంటే ఎవరని అడిగితే మీరేమని చెప్పారు?

శ్రీశ్రీ : కమ్యూనిజం అని జవాబు చెప్పాను. ఏం తప్పా?

మధురవాణి: నా మొహంలా వుంది (నవ్వుతుంది). నోటికి ఏది వస్తే అది మాట్లాడేసెయ్యటమేనా?

శ్రీశ్రీ : నీ మొహానికేం నీది మధురవాణి మొహం –

మధురవాణి : కమ్యూనిజం మీ హృదయంలో నిదురించే చెలి అన్నారే ఆ మాట ఎంత అనాగరికంగా వుందో ఆలోచించారా? మీ కమ్యూనిస్ట్ కవుల్లో ఆవేశమే కాని ఆలోచన తక్కువనుకుంటా. ఒకవేళ వున్నా దాన్ని అదిమి చిదిమేసి నాశనం చేసుకుంటారు.

శ్రీశ్రీ : నన్నంటే పడతా. నా ఆదర్శాల్నంటే తిరగబడతా – నేనంటే ఎవరనుకున్నారో –

నేను ముసలివాణ్ని
కాను అసలువాణ్ని
పడగెత్తిన తాచుపాము బుసలవాణ్ని
పిడితుల్ని వెంటేసుకు మసలువాణ్ని
అందుకున్న ఆకాశపు కొసలవాణ్ని

మధురవాణి: కమ్యూనిజం రష్యాలో కునికేసిందని గిరీశంగారు మొన్న చెబుతూంటే విన్నా. మీరింకా 'లేలేలే రష్యా, రారారా రష్యా' పాటే పాడుతున్నారు. స్టాలిన్ కళ్ళజోళ్ళు తీసేసి ప్రపంచాన్ని చూడండి. కామ్రేడ్ .

శ్రీశ్రీ : నీకీ భోగట్టాలన్నీ ఎవరు చెబుతున్నారో అర్థం గాకుండా వుంది. రావప్పంతులికా యింగ్లీషు రాదు. పోలి సెట్టి, సిద్ధాంతి బేస్తు అడ్డానికి తప్ప పనికి రారు. గుంటూరు శాస్త్రుల్లు ఏవన్నా నీకు పేపరు చదివి వినిపిస్తున్నాడా? అటువైపు వాళ్ళకి తెల్లారి లేస్తూనే కాఫీతోపాటు పేపరుండాలి చేతిలో –

మధురవాణి: నిన్నటి కమ్యూనిస్టులు
నేటి మర్యాదస్తులు
ఉదారవాదులు సంపన్న గృహస్థులు
వ్యాపారైక దృష్టులు
తపోభ్రష్టులు –
అన్నారా లేదా? వుండండి –

తెల్ల కమ్యూనిస్టులు
రక్తపాతాని కనిష్టులు
విప్లవానికి బహిష్ఠులు
ఇందిరారాధనలో శ్రేష్ఠులు
నవభారత ధార్తరాష్ట్రులా రివిజనిస్టులు.

అని వాళ్ళని తిట్టి యింగ్లండు నుంచి ఫామిలీతో సోవియట్ రష్యా వెళ్ళడానికి ట్రయి చేస్తే – మీరు మమ్మల్ని తిట్టారు, మీచేత తిట్టించుకుని మిమ్మల్ని మా దేశానికి ఆహ్వానించ గలమా అని మెత్తగా చివాట్లేశార్ట మీకు. నిజమా?

శ్రీశ్రీ : ఔరా నీకు యీస్టుపిడ్ భోగట్టా అంతా ఎవరు జేరేశారు?

మధురవాణి : చెప్పుకోండి చూద్దాం జనాబ్ శ్రీశ్రీ అలీషాగారూ!

శ్రీశ్రీ : నా లిమరిక్కులు నీకు తెలుసే – ఆశ్చర్యం! ఎప్పుడు చదివావు?

మధురవాణి : అసిరిగాడిచేత అప్పలస్వామిగారి లైబ్రరీ నుంచి తెప్పించుకున్నా.

శ్రీశ్రీ : ఏడీ వాడింకా రాలేదే – ఆ డబ్బులట్టుకు వాడు ఏ కల్లు కొట్టుకేనా చపాయించేశాడేవిటి చెప్మా?

మధురవాణి : వెళ్ళింది వాడు కాదే! సౌజన్యారావు పంతులుగారిచ్చిన ఫ్లాస్కులో కాఫీ వుందో లేదో చూసి తెద్దునా?

శ్రీశ్రీ : కాఫీ-కాఫీ-కాఫీ! నాలుక పీక్కుపోతుంటే – ఫస్ట్ థింగ్స్ ఫస్ట్ వేరీజ్ మై డ్రింక్?

మధురవాణి : ముందు మందిస్తే మాట విన్నని మీ శిష్యుడు వార్నింగిచ్చాడు.

శ్రీశ్రీ : ఆహ్హా యీ శిష్యులకి విసిన కర్రలకీ (ఫాన్స్) బందీనైపోబట్టి గదా నాకీ అవస్థ – హా హతవిధీ... కటకటా... లొటిపిటా...

మధురవాణి : మీరు కన్యాశుల్కం బీభత్స ప్రధానమైన నాటకం అని ఎందుకన్నారు? మా గురువుగారు సరసులే గాని బీభత్సపు మనిషి కారే?

శ్రీశ్రీ : బీభత్సం రసరాట్టు
దానిస్థాయి జుగుప్స
అజీర్ణాని కౌషధమది
అనవసరం విచికిత్స

అసహ్యాన్ని పుట్టించడ
మన్నదె నా హిత భావన
ఎవరిమీద ఎందుకోస
మన్నది మీ అవగాహన

కరుణరసం శృంగారం
వాడిన పూరేకులు
వీరరసం బీభత్సం
ఈనాటి తుపాకులు.

మధురవాణి : మీ కమ్యూనిజం కూడా యిప్పుడు వాడిన పూరేకుల్లో కలిసిపోయింది. గురజాడ వారికీ మీకూ కళ్ళజోళ్ళు వేరు వేరు.

శ్రీశ్రీ : మా గురువుగారు మనుషుల్లో చూడమన్నాడు. నేను నిలబడి మనుషుల్లో చూస్తున్నాను. కన్యాశుల్కం చూశాక నా కనిపిస్తుంది –

నేనూ ఒక మూర్ఖుణ్నే
ఐనా నాకన్న మూర్ఖులగపడుతుంటే
ఆనందపారవశ్యము
చే నవ్వక తప్పలేదు సిరిసిరిమువ్వా.

మధురవాణి : పద్యాలకి పళ్ళు రాలవు, చింతకాయలు చెట్టుమీదే వున్నాయి, ఏవంటారు?

శ్రీశ్రీ : తెలుగు స్వతంత్రలో 'విశాలాంధ్ర' పొట్టి శ్రీరాములు గారు పోక ముందు రాశా – ఇవన్నీ నీకెవరు చెప్పా..

మధురవాణి : ఇంకెవరు – కె.వి. రమణారెడ్డి గారు కొన్నాళ్ళు మా యింట్లో 'శ్రీశ్రీ లెక్చర్లు' యిచ్చారు.

శ్రీశ్రీ : మీ యింటికాయన ఎందుకొచ్చాడు?

మధురవాణి : మహోదయం అని గురజాడ వారిపై పెద్ద పుస్తకం రాస్తూ ఏవో సందేహాలుంటే అడగటానికి వస్తానంటే గిరీశం గారు తీసుకొచ్చారు.

శ్రీశ్రీ వాళ్ళిద్దరూ ఫ్రెండ్సా –

మధురవాణి : వెంకటేశానికి కావలి కాలేజిలో యింగ్లీషు ట్యూటర్ పోస్టు కావాలి. రమణారెడ్డి గారితో చెప్పి యిప్పిస్తావని గిరీశంగారు తీసికెళ్ళి పరిచయం చేశార్లె

శ్రీశ్రీ : నా అనుభవంలో శత్రువుల కంటె మిత్రుల వల్లే ఎక్కువ డామేజి జరుగుతూ వుంటుంది.

మధురవాణి : మీ కవిత్వం అర్థం గాకపోయినా మిమ్మల్ని ఆకాశానికెత్తేసి ఆరాధించడం యువకుల్లో ఫాషనైపోయిందని అజ్ఞానుల ఆరాధన మిమ్మల్ని మహాకవి చేసిందని ఓ విమర్శ వుంది. దానికి మీరేమంటారు?

శ్రీశ్రీ : పుంస్త్వమైన తనూ సౌందర్యం నా కవిత్వానిది. వీరేశలింగం తరవాత నా అంత సువిఖ్యాతుడూ సంస్థా కల్పుడూ అయిన కవి - వ్యక్తి మరొకడు లేడని నేను కె.వి.ఆర్‌ను అనమనలేదే? ప్రపంచం ముఖ్యంగా యువతరం నా వెంట వచ్చిందని అసూయపడే వాళ్ళకు నేనేమని

జవాబు చెప్పాలి? ఎందుకు చెప్పాలి?

మధురవాణి : తూర్పు గాలి కంటె పడమటి గాలికి మీరు ఎక్కువ స్పందించార్ట. సాహిత్య అంతర్జాతీయత ముందు వచ్చి రాజకీయ అంతర్జాతీయత తరవాత ఏర్పడిందట తమకు. అందుకే –

సరిహద్దులు లేని
సకల జగజ్జనులారా!
మనుష్యుడే నా సంగీతం,
మానవుడే నా సందేశం!

అనగలిగారు గనకే కుర్రకారు మీకు బ్రహ్మరథం పట్టింది. అదీ అసూయ – ఆకాశమంత యెత్తు ఎదిగిన వాడ్ని అంగుష్టమాత్రులు వెక్కిరిస్తూంటారు.

శ్రీశ్రీ : మహాకవి అయ్యాక మర్యాదలకి అలవాటు పడతాం. ఎంత చిన్న అమర్యాదనైనా భరించడం కష్టం.

మధురవాణి : శ్రీశ్రీ గారూ చిన్న మాట. ఎవరైనా యీ యిల్లు నాది, యీ తోట నాది, యీ ఆస్తి నాది, యీ డబ్బు నాది అనే వాళ్ళను చూశాం గాని యీ యుగం నాది అన్నవాళ్ళను చూళ్ళేదు. ఎందుకలా అన్నారు?

శ్రీశ్రీ : అదా – దాని గురించి ఓసారి ఎవరితోనో అన్నా. యావదాంధ్ర దేశంలో ఏ యింటికైనా వెళ్ళి అమ్మా నేను శ్రీశ్రీని నాకాకలేస్తోంది అంటే ఏ తల్లి అయినా పిల్చి నాకింత అన్నం పెడుతుంది. అంతకంటె నాకేం కావాలి?

మధురవాణి : మీరింత సింపుల్ మనిషి గనకే మీరు యువతరాన్ని యిట్టే ఆకర్షిస్తారు. కవి నీ గళగళన్మంగళ కళాకాహళ హాళాహాళిలో - యిది కుర్రాళ్ళ కెంతమందికి అర్థం అయిందని వాళ్ళు మీ వెంట బడుతున్నారని కొందరడుగుతున్నారు?

శ్రీశ్రీ : ఎవరా కవులు?

మధురవాణి : తమని మీతో పోల్చుకుని మిమ్మల్ని తక్కువ చేసేవాళ్ళ నేమనాలి?

శ్రీశ్రీ : నాకేమో లోకంలో
కాకవులే కానరారు, కవిదూషణ న
న్నాకర్షించదు, రచనో
త్సేకాన్నే మెచ్చుకొందు సిరిసిరిమువ్వా.

మధురవాణి : మరి లిమరుక్కుల్లో కళాకాళీ, మిల్క్ ఆఫ్ మెగ్నీషియాలు రాయకుండా వుండాల్సింది. ఇహిహీ, తెలుసా, కిరాణాకొట్టు కూడా మీరు రాయాల్సి నవి కావు. పైగా నక్సలైట్ల విధ్వంసకాండకు మీరిచ్చిన బ్లాంక్ చెక్కు

అస్మదీయులకో సర్టిఫికెట్టు తస్మదీయుల కింకోరకం అన్నట్లు లేదా

విప్లవకారుల విధ్వంస
బీభత్సకాండకు నా ప్రశంస
అదెన్నడూ కానేరదు హింస
అది నూతన చేతనారిరంస
మానవ మానస మానసరోవర హంస

హింసకు యోగ్యతా పత్రాలివ్వడం చాలా డేంజరు గురువుగారూ!

శ్రీశ్రీ : అది నీ అభిప్రాయం. కవుల నీడ ప్రపంచం మీద పడుతుంది. ప్రపంచం కవుల మీద తన ప్రేరణ ముద్రిస్తుంది. గతంలో జీవించే శాస్త్రీలు మాత్రమే వర్తమానానికి స్పందించటం మానేస్తారు. ఇంటర్వ్యూ అవుతోంది. కాని వేరీజ్ మై డ్రింకు? ద్రవాలూ లేవు, ఉపద్రవాలూ లేవు.

మధురవాణి : పక్క గదిలో అన్నీ రెడీ చేసి వుంచాం. మీతో ఎవరు కంపెనీ?

శ్రీశ్రీ : శ్రీశ్రీకి శ్రీశ్రీయే కంపెనీ.

మధురవాణి : చేదు విషం జీవఫలం కవిత కరక్కాయ సుమీ అన్నారు (నవ్వు).

శ్రీశ్రీ : ఎందుకు నవ్వుతావు?

మధురవాణి : పూర్వ కవులెవరూ కరక్కాయలు వాడలేదు. ద్రాక్ష పళ్ళూ, కొబ్బరికాయలూ, దొండపళ్ళూ వాడారు కాని –

శ్రీశ్రీ : కవిత దబ్బకాయలు సుమీ, చింతపండు అనికానీ దోసపండు అని కానీ ఎందుకు వాడతారంటావు?

మధురవాణి : నాటొటాల్ శ్రీశ్రీ గారూ! కరక్కాయ ఎలా వచ్చిందని నా బాధ?

శ్రీశ్రీ : అలా అడిగావు బాగుంది. నా ఫస్ట్ డ్రింకు గురించి చెబుతాను విను.

మధురవాణి : మహానుభావా! నేనడిగింది కరక్కాయ గురించి.

శ్రీశ్రీ : వన్ థింగ్ లీడ్స్ టు ది అదర్. మొట్ట మొదటిసారి మద్రాసు పోర్టులో పనిచేసే ఫ్రెండ్ ఒకతని రూమ్‌కి వెళ్ళాను నేను. అతను పోర్టు నుంచి చవగ్గా ఒక రమ్ బాటిల్ తెచ్చి రూములో దాచాడు. అంతకు ముందు నేను డ్రింక్ ముట్టుకోలేదు. పైగా నా ఫ్రెండ్ నేను మందు ముట్టనని నా మీద నమ్మకంతో డ్యూటీకి వెళ్ళాడు. నా కెందుకో రమ్ము రుచి చూడాలనిపించింది. అంతే-సీసా ఓపెన్ చేసి గటగట మంచి నీళ్ళు త్రాగినట్లు తాగేశాను పూర్తిగా. తరవాత మూడు రోజులకు గాని తెలివి రాలేదు.

మధురవాణి : గొప్ప పనిచేశారు. ఏకేశ్వరోపాసన కొంప ముంచేది. ఇంతకీ మీ ఫస్ట్ డ్రింక్ గురించి ఎందుకు చెప్పినట్లు?

శ్రీశ్రీ : ఆ డ్రింకు మైకంలో మద్రాను పోర్టులో ఎగుమతి అవుతున్న కరక్కాయ బస్తాలు చూశాను. డ్రింకు మీద నాకు 'చేదు విషం జీవఫలం కవిత కరక్కాయ సుమీ' అన్న మాటలు పలికాయి.

మధురవాణి : చిత్రం చిత్రం మహా విచిత్రం అన్నట్లు వున్నాయి. మీ మాటలు.

శ్రీశ్రీ : నేను మితభాషిని.

మధురవాణి : (నవ్వుతుంది) అంటే మితంగా డ్రింకు పుచ్చుకునే వారని (మళ్ళీ నవ్వు) అవునూ 'దొంగ లంజకొడుకు లసలే మెసలే యీ ధూర్త లోకంలో' అని మహాప్రస్థానం అంకితం పద్యంలో రాశారు అంటే ఎవరని.

శ్రీశ్రీ : నువ్వు ఎవరనుకుంటే వారే – అసలు వాళ్ళ గురించి నా కంటే నీకే ఎక్కువ తెలిసుండాలి.

మధురవాణి : అది కాదు. మీ ఎర్ర చెడ్డీల వాళ్ళు కేపిటలిస్టుల్ని ముఖ్యంగా అమెరికా వాళ్ళని తిట్టారని మురిసిపోతుంటేనూ.

శ్రీశ్రీ : కొంపెల్ల జనార్ధనరావుని హింసించి అతని దారిద్ర్యానికి మృత్యువుకి కారణమైన వాళ్ళని కాబోలు అందులో తిట్టాను –

మధురవాణి : పూటకూళ్ళమ్మని సాయం తీసికెళ్ళాల్సింది మీరు.

శ్రీశ్రీ : అది గిరీశానికి సూటయినట్లు నాకు సూటుగాదు. యింతకీ ఎవరంటే – చందాలు కట్టని పాఠకులు, సహకరించని పత్రికలవాళ్ళు యింకా యితర అప్పారావులయివుంటారు. నేను మహాప్రస్థానంలో వాడిన దొంగలంజకొడుకులనే మాట ఎంత విస్తృత మయినదంటే ఎవరికి కావలసిన వాళ్ళని వారు చేర్చుకోవచ్చు. తిట్టు... మనకు కొత్తదేమీ కాదు గదా!

మధురవాణి : నీ మొహం చూస్తే మీరు నాస్తికుళ్ళా పైకి కనపడరు. మీరు తెచ్చే విప్లవానికీ నాస్తికత్వానికీ ఏదైనా దగ్గర చుట్టరికమా?

శ్రీశ్రీ : దొంగభక్త పరాధీనుడైన భగవంతునికీ, గాంధీగారి రామరాజ్యానికీ, కాంగ్రెస్ రాజకీయాలకీ వున్న చుట్టరికమే మాకు యిన్స్పిరేషన్. మాదీ అదే చుట్టరికం మేడం!

మధురవాణి : చాల్చాలు! ఏమి నేర్చుకుపోయారు? మీకేనా భగవంతుడు తెలివితేట లిచ్చింది? మీవి పాదరసాలూ మావి మట్టి బుర్రలూనా?

శ్రీశ్రీ : ఎందుకలా బెజవాడ ఎండల్లా రెచ్చిపోతున్నావు?

మధురవాణి : మీవాళ్లు నవజీవన బృందావన నిర్మాతలూ మావాళ్లు కీటక సన్యాసులూనా? పండితాః సమదర్శినః అన్నారు గీతలో - కమ్యూనిస్టులేవన్నా అవతార పురుషులా?

శ్రీశ్రీ : నా మరో ప్రస్థానంలో 39వ పేజీ నువ్వు చూడలేదా మధురవాణీ?

మధురవాణి : ఏముందక్కడ మీప్రగల్భాలు తప్ప -

శ్రీశ్రీ : చెప్పుకో చూద్దాం. అవే అవే మాకవులకు కర్ణాభరణాలు.

మధురవాణి : గుర్తొచ్చింది - నువ్వు మధురవాణివి కావాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. నువ్వు కన్యాశుల్కం చదవాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. నువ్వు సాంబారు తాగాలంటే ముందు కమ్యూనిస్టువి కావాలి. యిదేనా మీ కల్లోల/ నక్సల్బరీ/ విరసం దశాబ్దం?

శ్రీశ్రీ : నన్ను రావప్పంతుల్ని చేసి ఆట పట్టిస్తున్నావు. నన్నేవన్నా అన్నావంటే మావాళ్లు మధురవాణికి సామాజిక స్పృహలేదని వ్యాసం రాసి నిన్ను మీవూరు బండివాడ్ని తోడిచ్చి కాంగ్రెసులోకి తోలేస్తారు జాగ్రత్త!

మధురవాణి : దేశమంటే మనుషులోయ్ అని గురజాడ రాస్తే మీరు దేశమంటే ఒక మురికి లాండ్రీ అన్నారు గుర్తుందా? తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు అవునా?

శ్రీశ్రీ : ఏమి దెప్పుతున్నావు నన్ను మధురవాణీ. నువ్వు నన్ను తలవాచేలా తిడుతున్నా నాకు అమ్మవారొస్తే వేపమండలతో విసిరినంత హాయిగా వుంది.

నీవు చూపిస్తున్నబాట<br>
యథాస్థితి కొక కంచుకోట<br>
హింసతోనే సృష్టి పుస్తది<br>
హింసతోనే మార్పు వస్తది

మధురవాణి : పుస్తది వస్తది అంటూ ఏవిటా దిక్కుమాలిన భాష? వేమనగారు కూడా తమరు రాసిన 'నిన్నటి జట్కావాలా' చూసి కళ్ళు తిరిగి పడిపోతారు సామాజిక స్పృహ తప్పి.

శ్రీశ్రీ : అంటే ఆనంద పారవశ్యం చేతా?

మధురవాణి : నవయుగ భగవద్గీతా ఝుంఝుని ప్రసరిస్తాను, హరోం హరా కదలండీ అని రాసిన 'మహానుభావుడివి' 'గుర్రానికి రెండేపులా రగతం' అంటూ 'మరోప్రస్థానం'లో రాయడం నవబా కామ్రేడ్ ?

శ్రీశ్రీ : ఎటువంటి వాళ్ళు నాపక్కన వుంటే అటువంటివాళ్ల ప్రభావం నామీద పడుతుంది. ప్రజల భాషలో రాయడం ప్రాక్టీసుచేస్తే తప్పా?

మధురవాణి : ఆగవయ్యా యెర్రి బ్యామ్మడా - అన్నట్టు నువ్వు బ్యామ్మణ్ణను కోవడం మానేశావటగా, అని మీకు మీరే కితాబిచ్చుకోవడం, తనే తుమ్ముకుని తనే శ్రీరామరక్ష అనుకున్నట్లు కాదా! కుర్రాళ్ళతో పోటీ పడాలని తవరు గుర్రందిగి గాడిదెక్కినట్లుగా వుంది.

శ్రీశ్రీ : మావాళ్లను దొంగదెబ్బలు కొడుతున్నావు. విరసం అంటే నీకెందుకంత లోకువా?

మధురవాణి : మనం ఎవరిని ప్రేమిస్తున్నామో వారినే విమర్శిస్తాము. ఆమెన్!

శ్రీశ్రీ : ఇది విప్లవ విజయవేళ, ఎవరూ కాదనలేరు! అథవా బధిరాంధులు కాదంటేమవతారు!

మధురవాణి : కోతల్లో గిరీశంగారిని మించిపోయినట్లున్నారు -- ఎంతసేపు మీకు ఆత్మస్తుతీ పరనిందా సిగ్గులేకుండా -

శ్రీశ్రీ : మహాకవిని తిడుతున్నావ్. చరిత్ర నిన్ను క్షమించదు.

మధురవాణి : నువ్వు కమ్యూనిస్టువి కావాలంటే
మనిషిగా జీవించాలంటే
ఇప్పుడే ఎర్రసేనలో కలియాలి
నువ్వు ఎర్రసేనలో కలియాలి - ఎక్కడుందండీ మీ ఎర్రసేన?

శ్రీశ్రీ : ఎర్ర సేనకాదు. మాది లోకానికి కన్నెర్రసేన.

మధురవాణి : ఈ శబ్దచాంచల్యమే మీకొంప ముంచింది. మాటల్ని పేల్చి అన్నీ సాధించామనుకుంటారు. మీది విప్లవ కవితా చాంచల్యమే కాని చైతన్యం కాదు.

శ్రీశ్రీ : పొద్దున్నే లేచి ఎవరి మొహం చూశానో... మంచంకింద దాక్కున్న రావప్పంతుల్లా అయిపోయాను.

మధురవాణి : ప్రతి కవికీ జీవితంలో ఓ చీపురుకట్ట సరసం వుంటుంది. తప్పదు.

శ్రీశ్రీ : ఏం యిలనైన మాటలు యింటున్నాం. లోకం పూటకూళ్ళమ్మ మరియు ఆమె చేతిలో చీపురుకట్ట. జీవితం అంటే ఎప్పేవు మధురవాణి మంచంక్రింద దాక్కోవడం.

మధురవాణి : విప్లవ మహాకవికైనా - సరసము విరసము కొఱకే!

శ్రీశ్రీ : బాబ్బాబు నీకు పుణ్యం వుంటుంది. విరసం హాంగోవర్ మానేసి ఇంకేదైనా మాట్లాడరాదూ?

మధురవాణి : కరటకశాస్త్రి శిష్యుడు వేయిపడగల్ని తెలుగులోకి ట్రాన్స్లేట్ చేస్తున్నాడట!

శ్రీశ్రీ : వేళాకోళానికైనా హద్దూ పద్దూ వుండాలి.

మధురవాణి : మీ మరో ప్రస్థానం చైనీస్‌లోకి గిరీశంగారుఅనువదించగాలేనిది వేయిపడగల్ని కరటకశాస్త్రి శిష్యుడు...

శ్రీశ్రీ : స్టాపిట్. నాకు కోపం వస్తే మనిషిని కాను.

మధురవాణి : అల్లాగే కనిపిస్తోంది. మీ ఇన్‌స్ట్రుమెంట్స్ అన్నీ రడీ - మీడ్రింకు రడీ. మీకు మీరే కంపెనీ. పక్క గదిలో అన్నీ అరేంజి చేశాను. పుద్దు సంగతి సరేసరి.

శ్రీశ్రీ : గానుగలో తెలకపిండి ఆడించినట్లు నన్నాడిస్తోంది. మధురవాణితో మాట్లాడి జయించుకు రావడం సులభం కాదు. (పైకి) నువ్వు వచ్చి పక్కన కూర్చుని కంపెనీ యిస్తే అరిగిపోతావా?

మధురవాణి : నేను యీ వృత్తి మానేసి చాలా కాలం అయింది. భగవద్గీత తెస్తాను పుచ్చుకుంటారా?

శ్రీశ్రీ : ఓ సిజర్ సిగరెట్ కాల్చుకుంటా. పోనీ అగ్గిపుల్లకైనా నోచుకోలేదా? (అగ్గిపుల్ల గీస్తుంది మధురవాణి. శ్రీశ్రీ సిగరెట్ ముట్టించుకుని అతని స్టయిల్లో పీలుస్తూ వుంటాడు) ఆశయాలు సంఘర్షించే వేళ ఆయుధం అలీనం కాదు. (మత్తులో) నవధర్మం మానవధర్మం, అణవశక్తి కన్న మానవశక్తి మిన్న (అగ్ని కవిత్వం చదువుతాడు).

ఔను మరి బూర్జువా వర్గాలన్నా
పోలీసు రాజ్యం
పూజారి రాజ్యం అన్నా
నాకు విపరీతమైన ద్వేషం...

మధురవాణి : కాస్త చల్లని మజ్జిగ పుచ్చుకోండి. పాపం పైత్యం దిగుతుంది. వద్దు యింక మానరా - నామీదొట్టు. అమృతం పుచ్చుకుని దేవతలూ పుచ్చుకోక రాక్షసులూ చెడ్డారు.

శ్రీశ్రీ : శుక్రాచార్యుల వారిమాటేవిటి? కచ దేవయాని కథ నీకు నృత్య నాటిక రాసిస్తా. (మత్తెక్కి) జరత్కారుని చమత్కారంలాగు నన్ను నేను తిరగేసి తొడుక్కున్నాను... అర్థం లేదు అలాపన - అయితే - అబద్ధం కాదు ఆశ్చర్యం. (తనలో) ఆఖరిమాట మొదటిమాట ఆశలకే అనంతం, అప్సరావు వానేస్తం. ఆంధ్రత్వం నాశాపం. (గ్లాసు గోడకేసి కొడ్తాడు.) తెలుపురంగు సత్యానిది, పసుపురంగు పైత్యానిది, నలుపు రంగు చీకటిది, ఎరుపురంగు ఆకలిది!

మధురవాణి : మరో ప్రపంచం పిలిచింది మరో ప్రపంచం పిలిచింది అని మీరు మాత్రం మరో ప్రపంచంలోకి వెళ్లిపోయారు మమ్మల్ని యిక్కడే వదిలేసి.

(మిగతా వచ్చే సంచికలో)

# కలలుగన్న భారతదర్శనం

– ఎన్. ఇన్నయ్య

కామి గానివాడు మోక్షగామి కాడయా అనే తత్వాన్ని అధ్యయనం చేసి వంటబట్టించుకున్న అగేహానంద భారతి అస్తమించాడు. (మే 18-1991). సంస్కృతం ఔపోశనం పట్టిన లెపోల్డ్ ఫిషర్ (తల్లిదండ్రులు పెట్టినపేరు) వియన్నానుండి జర్మనీ వచ్చి సుభాష్ చంద్ర బోసుతో ఆజాద్‌హింద్ ఫౌజులో పనిచేశాడని కొద్దిమందికే తెలుసు. 1948లో ఇండియా వచ్చి రామకృష్ణ మిషన్‌లోచేరి అద్వైత ఆశ్రమంలో దీక్ష పుచ్చుకొని వివేకానంద సంపూర్ణ రచనల లోతుపాతులు అవగాహన చేసుకున్నాడు. రామకృష్ణ పరమహంసను అవతారంగా అంగీకరించనందుకు ఆశ్రమానికి తిలోదకాలివ్వాల్సి వచ్చింది. 36 సంవత్సరాలకే స్వీయానుభవాలు వ్రాసి ''కాషాయ వస్త్రం'' శీర్షికన గ్రంథాన్ని ప్రచురిస్తే, వత్తిడిచేసి రామకృష్ణమిషన్ వారు ఆ గ్రంథాన్ని నిషేధింపజేసి లోగుట్టు ప్రపంచానికి తెలియబరుచుకున్నారు. తరువాత శంకరాద్వైతిగా కాశీలో సన్యాసి అయిన రామచంద్ర (పెట్టుకున్న పేరు), అగేహానంద భారతిగా దేశంలోని నలుమూలలా వున్న శంకరమఠాలకు షుమారు 1200 మైళ్ళు నడచి కాలినడకన వెళ్లి మఠాధిపతులను దర్శించి, వాదించి ఎన్నో సంగతులు గ్రహించాడు.

కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్రం చెబుతుండగా ఒకసారి ముస్సోరి వెళ్ళబోయి త్రోవలో డెహ్రాడూన్‌లో ఎం.ఎన్. రాయ్‌ను కలసి అక్కడే ఆగిపోయాడు. రాయ్ భావాల ప్రభావానికిలోనై, సెక్యులర్ బ్రాహ్మణుడంటూ ఆయనకు తన ఉత్తమరచన ''గ్రేట్ ట్రెడిషన్, లిటిల్ ట్రెడిషన్స్'' అంకితం యిచ్చాడు. కొద్దిరోజులు ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువు చెబుతూ, నలంద బౌద్ధ విశ్వవిద్యాలయం వెళ్లి బౌద్ధం పరిశీలించాడు. బాంకాక్, టోకియో, కొయొటో, విశ్వవిద్యాలయాలలో కూడా బౌద్ధాన్ని చెబుతూ థేరవాద బౌద్ధంలో పరవశించాడు. వాషింగ్టన్ యూనివర్సిటీ (సియాటల్)లో భారతీయ ప్రాచీన మానవ శాస్త్రాల్ని బోధిస్తూ (1957-61) చివరకు న్యూయార్క్ సిరాక్యుస్ విశ్వవిద్యాలయంలో కుదురుకొని చనిపోయేవరకూ అక్కడే వున్నాడు.

అమెరికానుండి రెండేళ్లకో పర్యాయమైనా ఇండియావచ్చి, తన మేధస్సుకు పదును పెట్టుకుంటూ ఉపన్యాసాలిచ్చి, అనేక వివాదాస్పద విషయాలు చర్చకు పెడుతుండేవాడు.

తాంత్రిక విద్యను ప్రత్యేకంగా గ్రహించి ఒక పుస్తకం కూడా ప్రచురించాడు. భారతీయ తత్వంలో యోగం, అందునా తంత్రం విలక్షణమైనదని, అది దేశీయంగా నిలిచివుంటుందని నమ్మాడు. దేశ విదేశాలలోని సన్యాసుల, ఆశ్రమాల వ్యాపార లక్షణాలను బయటపెట్టి విమర్శించాడు. భారతీయ భాషలలో ముఖ్యంగా ఉర్దు, హిందీ, బెంగాలి మాట్లాడి, గ్రామస్తుల స్థాయిలో అవగాహన అయ్యేట్లు తత్వాన్ని చెప్పేవాడు. భారతీయ చింతనలో స్త్రీలకుగల అర్హతను నిశితంగా పరిశీలించాడు. రామణీయకత అంటే ఏమిటో విడమరచి ఖజరహో కోనార్క్ దేవాలయాలపై వివిధ భంగిమలలోవున్న సౌందర్య శిల్పాలను ఎలా చూడాలో విడమరచి చెప్పాడు.

సన్యాసిగానే జీవితం గడపిన అగేహానందభారతి భారతదేశంలో తనకు నచ్చినవి, నచ్చనివి ఏమిటో నిర్భయంగాచెప్పి చివరకు మానవ విలువలపట్ల మొగ్గు చూపాడు. 68 సంవత్సరాలకే కేన్సర్‌తో చనిపోయిన అగేహానంద 1987లో హైదరాబాద్ వచ్చి ఎం.ఎన్.రాయ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఉస్మానియా, సార్వత్రిక విశ్వవిద్యాలయాలలో భారత పునర్వికాసంపై ఉపన్యాసాలిచ్చారు. రాధాకృష్ణన్ ప్రచారకుడుగానే మిగులుతాడుతప్ప ఆయనదిగా స్వంత తత్వమంటూ ఏమి ఏర్పరచుకోలేదని భారతి నిష్కర్షగా తేల్చి రాశారు. ఆయన ప్రమాణ వ్యాసాలు 500 వరకూ వుండగా, పుస్తకాలు 10 వరకూ మిగులుతాయి.

★ ★ ★

విశ్వనాథ సత్యనారాయణ గారి వేయిపడగల్లో ప్రతిచోటా శాస్త్రీయ జ్ఞానలోపం పాఠకుడికి గోచరిస్తుంది. పైగా సామాజిక సమస్యలను చర్చిం చేటప్పుడు భిన్నాభిప్రాయాలను పాత్రలచేత చర్చింపించరు. ఒకవేళ పాత్రలు ఇతర అభిప్రాయా లను ఎత్తుకొన్నా, ఆయా మతాల్లోని దుర్బలాంశా లనే ఎత్తుకుంటాయి. ముఖ్యాంశాలను, వీరు గుర్తించక పోవటంవల్లగాని, వీరి సిద్ధాంతాన్ని కూలద్రోస్తూ వుంటంవల్లగాని, ఎత్తుకోరు. అదే పనిగా సనాతన ధర్మాన్ని గూర్చి ఉపన్యాసాలు బనాయింపిస్తారు. దీనివల్ల సనాతనుడు కాని పాఠకు నికి అవి అసంతృప్తి, పరాఙ్ముఖత్వం కలిగిస్తాయి. పైగా 'షా'కు ఉన్న సర్వతోముఖమైన చతురోక్తి లేదు. అందువల్ల వీరి వేయిపడగలను సాంతంగా చదివేవాళ్లు కూడ అరుదు. సనాతనుడైన పాఠకు నికి కూడా కలిగేది సంతోషమేకాని ఆనందంకాదు.

– 1944లో రాసిన కావ్యజగత్తులో కీ.శే. జి.వి. కృష్ణారావు.

# Price of Popularity

Speedy and skilful, the western media turned its full technological gaze to India last week. The men from CNN and BBC were in every dusty corner of the country, poised to catch the inside story. Reflexes were quick as the multi-continental presence of Mark Tully, Romila Thapar, John Kenneth Galbraith, Daniel Moynihan, Khushwant Singh, Sir Sonny Sridath, Stephen Solarz *et al* mingled the actual and the ethereal via the monitor in the constructed intimacy of studio conversations.

★ ★ ★

The first informed discussion was aired by the BBC within a couple of hours of Mr Rajiv Gandhi's assassination, when many in India had still to hear the news. The professionalism got submerged, though, in the shocking ease with which visual juxtaposition recreated for western viewers the great oriental spectacle: another episode in the Raj series.

★ ★ ★

"Fate denied Rajiv Gandhi dignity in death. It would be absolutely inhuman to sensationalize this."

★ ★ ★

With one blow, the fortunes of 844 million people became hostage to a terrible uncertainty, leaving the nation to ponder a future without the Nehru-Gandhi dynasty.

★ ★ ★

The brutal assassination of Rajiv Gandhi leaves the nation to ponder a future without a dynasty.

★ ★ ★

By contrast, Priyanka was cleareyed and composed, a study of Nehru-like dignity in an extreme moment.

★ ★ ★

"His assassination" the *Economic Times* of New Delhi editorialized last week, "leaves a political vacuum, both in the Congress(I) and in the country.

★ ★ ★

Rajiv had offered a semblance of hope that reform, modernization, deregulation-all the catchwords underpinning his frequently quoted aim of "bringing India into the 21st century".

★ ★ ★

"He faltered at least partly because he was a young man in a hurry, because he lacked the framework and the experience to match his vision."

★ ★ ★

Said a senior British diplomat : "Indian democracy has weathered such blows before and can do so again." Economist John Kenneth Galbraith, U.S. ambassador to New Delhi from the Kennedy Administration, called the system "imperfect but secure." Said he: "The idea and the people of India would surrender their sovereignty to any form of dictatorship is not true. And I would feel sorry for anyone who tried to impose it on them."

★ ★ ★

Not long after Indira was elevated to the Congress presidency in 1959, Nehru was the first to abhor the prospect of a dynasty. He told an American interviewer, "I am not capable of ruling from the grave. How terrible it would be if I, after all I have said about the processes of democratic government, were to attempt to handpick a successor. The best I can do for India is to help our people as a whole generate new leadership as it may be needed."

★ ★ ★

MISIMI/ మిసిమి RNI Regd No.45042/90 Telugu Monthly Hyderabad-500 020

Postal Regd. No.H/SD/191

